
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
సోమవారం, 8 జూలై 2024



	కనిష్ఠం	గరిష్ఠం
ఖమ్మం	24	37
భద్రాద్రి	22	34



ఏదులాపురం చెరువులో అక్రమంగా నిర్వహిస్తున్న చెరువు మట్టి తోలకాలు

చెరువుల్లో మట్టి మాఫియా

- రైతుల పేరుతో అనుమతులు
- పగలు పొలాలకు.. రాత్రిళ్లు రియల్ వెంచర్లకు మట్టి తరలింపు
- విషయం తెలిసినా పట్టించుకోని అధికారులు ?
- రెచ్చిపోతున్న అక్రమార్కులు
- గత ప్రభుత్వంలో గుట్టలు, నేడు చెరువుల్లో మట్టి దందా

ప్రకృతి వనరైన మట్టి నేడు కొందరు అక్రమార్కులకు ఆర్థిక వనరైంది. అక్రమంగా దందా సాగించేవారు పెద్ద పెద్ద గుట్టలు, చెరువులను సైతం వదలకుండా తవ్వేస్తున్నారు. కొందరు అధికారులకు నెలవారీ మామూళ్లు అందిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఖమ్మం జిల్లాలో మొత్తం ఆరు సర్కిళ్ల పరిధిలో ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో 900 చెరువులకు రైతులు మట్టి తోలుకునేందుకు అనుమతులు మంజూరు చేశారు. ఈ మట్టిని కేవలం రైతులు తమ పొలాల్లోకి మాత్రమే తోలుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. కానీ రైతులు తీసుకున్న చెరువు అనుమతులను అడ్డం పెట్టుకొని మట్టి మాఫియా చీకటి దందా చేస్తోంది. ఈ వ్యవహారం కొందరు మైనింగ్, ఇరిగేషన్ శాఖ అధికారులకు తెలిసినా వారు తమకు తెలియనట్టే వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఖమ్మం ఖానాపురంహవేలి, జూన్ 7: పగటి వేళల్లో రైతుల పొలాలకు కొంతమేర మట్టి తోలకాలు చేసి రాత్రి వేళల్లో రియల్ఎస్టేట్ వెంచర్లకు ఒక్కో ట్రాక్టర్ రూ.1,000, టిప్పర్ రూ.3,000లకు అమ్మకాలు సాగిస్తున్నారు. ప్రభుత్వానికి రూపాయికూడా చెల్లించకుండా లక్షలు దండుకుంటున్నారు. ఈ వ్యవహారం మైనింగ్ అధికారులకు తెలిసినా చెరువు మట్టితో తమకు సంబంధం లేదని, ఇది తమ పరిధి కాదని అధికారులు చెప్పడం పలు అనుమానాలకు తావిస్తోంది.

సాధారణ సమయంలో చెరువు మట్టిని తరలిస్తే పట్టుకొని ఫైన్ వేసే అధికారులు దీనిపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే మాత్రం అది తమ పరిధి కాదని సమాధానం చెబుతారు. చెరువు మట్టి తోలకాలు నిర్వహించే పలువురు వ్యాపారులు ముందుగానే అధికారులతో మాట్లాడుకిని వారికి కొంత సమర్పించుకుంటున్నారనే ఆరోపణలూ వినిపిస్తున్నాయి. చెరువుల్లో మట్టి తవ్వకాలు చేస్తే మట్టిని ఒక క్రమ పద్ధతిలో సమానంగా తీయాల్సి ఉంటుంది. కానీ ఎక్కడ పడితే అక్కడ పెద్ద పెద్ద గోతులు పెడుతూ మట్టిని అక్రమంగా తోలకాలు జరుపుతున్నా ఏ ఒక్క అధికారి పట్టించుకోకపోవటం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మట్టి అనుమతులు తీసుకున్న వ్యాపారులపై అధికారులు చర్యలు తీసుకొని ఆ మట్టిని పొలాలకు మాత్రమే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రైతుల పేరుతో అనుమతులు..

ఖమ్మంరూరల్ మండలం, ఏదులాపురం, ఖమ్మం అర్బన్ మండలం కైకొండాయిగుడెం, బల్లేపల్లి, రఘునాధపాలెం, చింతకాని, ముదిగొండ, వైరా, తల్లాడ, ఇలా జిల్లాలోని అన్ని మండలాల్లోని గ్రామాల్లో చెరువుల్లో రైతు పేరుతో మట్టి తోలకాలకు అనుమతుల తీసుకొని అక్రమ మార్గంలో దందా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో చెరువు మట్టిన కేవలం సాగు భూములకు మాత్రమే తోలేవారు. కానీ ప్రస్తుతం రియల్ వెంచర్లు పెరిగిపోవడంతో ఆయా వెంచర్ల అభివృద్ధి మట్టి అవసరమవుతోంది. దాంతో అక్రమార్కుల దృష్టి చెరవులపై పడింది. ఖమ్మం నగర సమీపంలోని కైకొండాయిగుడెంలో గతంలో రెండు చెరువులు నీళ్లతో కళాకళలాడుతూ ఉండేవి. కానీ కొందరు ఆ భూములను సొంతం చేసుకోవటంతో చెరువుల భూములు కానరాకుండా పోతున్నాయి. చెరువునుంచి ఆయకట్టు రైతులు తమ భూముల్లోకి మట్టి తోలుకునేందుకు అధికారుల నుంచి అనుమతి తీసుకున్నారు. దీంతో చెరువులో నెలరోజులుగా ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్లతో మట్టి తరలిస్తున్నారు. ఈ క్రమంలో రైతుల పేరుతో అనుమతులు తీసుకున్న కొందరు మట్టి వ్యాపారులు పగలు రైతుల భూముల్లోకి మట్టిని తోలుతూ రాత్రి మాత్రం రియల్ వెంచర్లలోకి మట్టిని తరలిస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

జిల్లా కేంద్రానికి అనుకుని ఉన్న ఏదులాపురం ఈదుల చెరువులోనూ పగలు, రాత్రి తేడా లేకుండా సాగుతున్న మట్టి దందాతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఏదులాపురం చెరువు నుంచి ఒక్క ట్రాక్టర్ మట్టిని తరలిస్తే రూ.1,500 తీసుకుంటున్నారు. ఈ చెరువులో రోజుకు సుమారు వెయ్యి ట్రిప్పుల చొప్పున మట్టిని బయటకు తరలిస్తున్నారు. నెలరోజులకు సుమారు 30వేల ట్రిప్పుల మట్టిని తరలించారు. అంటే సుమారు రూ.4కోట్ల మేర మట్టి వ్యాపారం నిర్వహించినట్లు తెలుస్తోంది. ఈ ఒక్క చెరువులోనే ఇంతమెత్తంలో ఉంటే జిల్లా వ్యాప్తంగా ఇంకెన్ని కోట్లలో వ్యాపారం సాగుతుందో అర్థం చేసుకోవచ్చు.

ఈ అక్రమ మట్టి దందా ఐబీ, మైనింగ్ రెవెన్యూ శాఖల కనుసన్నల్లోనే సాగుతోందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. రెండు నెలలుగా పగలు, రాత్రి తేడా లేకుండా మట్టి దందా సాగుతున్నా స్థానికులు పందల సార్లు సమాచారం అందించినా అధికారులు అటుగా కన్నెత్తి కూడా చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. కమిషన్లు అందడంతోనే ఈ దందాను పట్టించుకోవడం లేదన్న ఆరోపణలూ వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో కొందరు అనుమతుల మాటున గుట్టలను తవ్వేస్తే ప్రస్తుతం కొందరు అనుమతుల మాటున చెరువుల మట్టి తవ్వేస్తూ భారీగా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు మారడంతో మనుషులు మారారే తప్ప మట్టి మాఫియా మాత్రం ఆగలేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు అక్రమంగా చెరువు మట్టి తోలకాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఏపీ సీఎం చంద్రబాబునాయుడిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఆదివారం మంత్రి తుమ్మల మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విభజన, సరిహద్దు సమస్యల పరిష్కారానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా తెలుగురాష్ట్రాల అభివృద్ధికి సబంధించి పలు అంశాలపై చర్చించారు. అందులో భాగంగా పట్టిసీమ నుంచి ప్రకాశం బ్యారేజ్‌కు అక్కడ నుంచి పులిచింతలకు గోదావరి జలాలు తరలింపు భవిష్యత్‌లో కీలకం కానున్నాయని అన్నారు.

ఏపీ సీఎం చంద్రబాబుతో తుమ్మల భేటీ

- విభజన, సరిహద్దు సమస్యల పరిష్కారానికి మంత్రి విజ్ఞప్తి

వివరాలు : 6లో



తన పొలాన్ని ధ్వంసం చేశారనే ఆవేదనతో ఆత్మహత్య చేసుకున్న చింతకాని మండలం పొద్దుటూరుకు చెందిన రైతు బోజడ్ల ప్రభాకర్ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. రైతు ఆత్మహత్యకు పురిగొల్పినవారిని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. రైతు ప్రభాకర్ ఆత్మహత్య బాధాకరమన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదివారం ఆయన పరామర్శించారు.

రైతు ప్రభాకర్ కుటుంబాన్ని ఆదుకుంటాం

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

వివరాలు : 6లో



రైతు బోజెడ్ల ప్రభాకర్ ఆత్మహత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని బీఆర్ఎస్ ప్రతినిధి బృందం ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌ను కోరింది. బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి, మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, రాష్ట్ర నాయకులు ఏనుగు రాకేష్‌రెడ్డి ఆదివారం సీపీని కలిసి వినతిపత్రం అందజేశారు.

ఆత్మహత్యకు కారకులను శిక్షించాలి

- ఖమ్మం సీపీ సునీల్‌దత్‌ను కలిసిన బీఆర్ఎస్ ప్రతినిధి బృందం

వివరాలు : 6లో



ప్రత్యేక రథంపై ఆసీనులైన దేవతామూర్తులు

వైభవంగా జగన్నాథ రథయాత్ర

- ప్రారంభించిన హెవీవాటర్‌ప్లాంట్ జీఎం జగ్గారావు
- అశ్వాపురం గౌతమీనగర్‌లో కోలాహలం

అశ్వాపురం, జూలై 7: భద్రాద్రి జిల్లా అశ్వాపురంలోని గౌతమీనగర్ కాలనీలో ఆదివారం సాయంత్రం జగన్నాథ రథయాత్ర వైభవంగా ప్రారంభమైంది. హెవీవాటర్ ప్లాంట్ జీఎం జగ్గారావు ముఖ్య అతిథిగా పాల్గొని ఈ రథయాత్రను ప్రారంభించారు. ఒడిశాలోని పూరి జగన్నాథ రథయాత్రకు అనుసంధానంగా ప్రతి ఏడాది ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అశ్వాపురం గౌతమీనగర్ కాలనీలో జగన్నాధ రథయాత్రను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన ఉద్యోగులు, అధికారులు ఉత్కల్ పదాగర్ సంస్థగా ఏర్పడి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. రథయాత్రను పురస్కరించుకుని జగన్నాథస్వామి, బలభద్రస్వామి, సుభద్రదేవి విగ్రహాలకు పహండీగుహలో ఉదయం ఆద్యపూజ, మధ్యాహ్నపూజ, పహండిపూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. దేవతామూర్తులను ప్రత్యేక పల్లకీలో మేళతాలాలు, మంగళవాయిద్యాలు, ఒడిశా సంప్రదాయ పద్ధతిలో ఊరేగింపుగా తొడ్కొని వచ్చి ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ప్రతిష్ఠించారు. ఒడిశా నుంచి వచ్చిన ప్రత్యేక పూజారుల మంత్రోచ్చరణల మధ్య జీఎం జగ్గారావు చెరపరా(రథాన్ని తుడవటం) నిర్వహించి పూజలు చేశారు. అనంతరం భక్తుల హర్షధ్వానాల మధ్య రథానికి అమర్చిన తాడును లాగి యాత్రను ప్రారంభించారు.



జీఎం జగ్గారావు పూజలు

గౌతమీనగర్ కాలనీలో కోలాహలం

రథయాత్ర సందర్భంగా అశ్వాపురం గౌతమీనగర్ కాలనీలో కోలాహలం నెలకొంది. రథయాత్ర జరిగే ప్రదేశంలో విద్యుత్ దీపాలతో ప్రత్యేక అలంకరించారు. తిలకించేందుకు కాలనీవాసులు భారీగా తరలి రావటంతో పండుగ వాతవరణం నెలకొంది. కాగా తొమ్మిది నిత్య పూజల అనంతరం 15వ తేదీన జరిగే బహుదా యాత్రతో ఈ రథయాత్ర ముగుస్తుంది. కార్యక్రమంలో డీజీఎంలు శ్రీనివాసరావు, శ్రీనివాసశర్మ, ఉత్కల్ పదాగర్ అధ్యక్షుడు అరుణమహపాత్ర, కార్యదర్శి సరోజిదాస్, సభ్యులు సందీప్‌సాహు, మదన్మోహన్‌సాహు పాల్గొన్నారు.

విభజనపై విముఖత

- ఒక్క పంచాయతీనే ముద్దంటున్న భద్రాద్రివాసులు
- 'మూడుముక్కల' పట్ల స్థానికుల అసంతృప్తి, ఆగ్రహం
- పునఃసమీక్షించాలని డిమాండ్

భద్రాచలం, జూలై 7: భద్రాచలం ఒకే పంచాయతీగానే కొనసాగాలని, మూడుగా విభజిస్తే భద్రాద్రి అస్తిత్వానికి ముప్పు వాటిల్లుతుందని మెజారిటీ భద్రాద్రివాసులు, రాజకీయ పార్టీల నాయకులు వాపోతున్నారు. గత ప్రభుత్వం భద్రాచలాన్ని మూడు పంచాయతీలుగా విభజిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి దాన్ని గవర్నర్ ఆమోదానికి పంపిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో శనివారం గవర్నర్ పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లుకు ఆమోదం తెలపడం సర్వత్రా చర్చకు దారి తీస్తోంది. భద్రాద్రిలో ఆదివారం ఎక్కడ విన్నా భద్రాద్రి పంచాయతీ విభజించడంపైనే చర్చ సాగింది. ఈ చర్య ఎంత మాత్రం అమోదయోగ్యం కాదని అధిక శాతం భద్రాద్రివాసులు పేర్కొంటున్నారు. పంచాయతీ విభజనతో భద్రాద్రి అస్తిత్వాన్ని కోల్పోతుందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు తెలిపారు. విభజన అంశంపై ఇప్పటికే జిల్లాకు చెందిన మంత్రులతో మాట్లాడినట్లు అధికార పార్టీ నాయకులు పేర్కొంటున్నారు భద్రాద్రివాసుల అధైరపడొద్దని వారు భరోసా ఇస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.

మూడు పంచాయతీలుగా విభజిస్తే ఇలా

భద్రాచలం పంచాయతీని మూడుగా విభజించడంతో విభజిత ప్రాంతాలు ఇలా ఉంటాయి. భద్రాచలం పంచాయతీ 700.4 ఎకరాల విస్తీర్ణంలో సర్వే నెంబర్లు 1 నుంచి 51, 121 నుంచి 126తో పాటు 127, 128, 132 సర్వే నెంబర్లలోని కొంత ప్రాంతాన్ని భద్రాచలం పంచాయతీలో కలిపారు. అలాగే సీతారామనగర్ పంచాయతీ 349.77 ఎకరాల్లో ఉండనుంది. సర్వే నెంబరు 52 నుంచి 90 వరకు దాని పరిధిలో ఉంటుంది. అలాగే శాంతినగర్ పంచాయతీ 997ఎకరాల్లో విస్తరించి ఉండనుంది. సర్వే నెంబర్లు 91 నుంచి 120 పూర్తిగా 121, 127, 128, 131, 132, 133, నుంచి 207 వరకు పాక్షికంగా కలవనుంది. ఇదిలా ఉండగా భద్రాచలం పంచాయతీకి 21 మంది వార్డు సభ్యులు, సీతారామనగర్, శాంతినగర్ పంచాయతీలకు 17 మంది చొప్పున వార్డు సభ్యులను ఖరారు చేశారు.



భద్రాద్రిని ఒకే పంచాయతీగా ఉంచాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో జరిగిన సమావేశం

డంపింగ్ యార్డు మళ్లీ సమస్యే..

దశాబ్దకాలంగా భద్రాచలానికి డంపింగ్ యార్డు లేదు. దీంతో గోదావరి తీరంలోని కరకట్టపై చెత్తను డంప్ చేస్తున్నారు. మూడు పంచాయతీలు చేస్తే ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న డంపింగ్ యార్డు శాంతినగర్‌కు వెళ్తే మళ్లీ భద్రాద్రికి, సీతారామనగర్‌కు డంపింగ్ యార్డు సమస్య తలెత్తుతుంది. అలాగే ప్రస్తుతం ఉన్న కొత్త మార్కెట్ సీతారామనగర్ పంచాయతీలోకి వెళ్తే భద్రాచలంలో మార్కెట్ ఉండదని భద్రాద్రివాసులు పేర్కొంటున్నారు. ఇలా చాలా అంశాల్లో భద్రాద్రిలో పరిపాలనపరమైన సమస్యలు ఏర్పడతాయని అధికార వర్గాలు చెబుతుండడం గమనార్హం. భద్రాచలం చిన్న పంచాయతీగా మారడంతో శ్రీరామనవమి, వైకుంఠ ఏకాదశి సమయంలో పంచాయతీ తరపున చేపట్టే పారిశుధ్య పనుల నిర్వహణ భద్రాద్రి పంచాయతీకి మోయలేని భారంగా మారుతుంది. ఇలా మరెన్నో సమస్యలు ఎదురయ్యే అవకాశాలున్నాయని భద్రాద్రివాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సీఎం దృష్టికి తీసుకెళ్లి ఒకే పంచాయతీగా చేస్తాం

డాక్టర్ తెల్లం వెంకట్రావు, భద్రాచలం ఎమ్మెల్యే



భద్రాచలాన్ని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మూడు పంచాయతీలుగా విభజిస్తూ బిల్లు అసెంబ్లీలో ఆమోదించి గవర్నర్‌కు పంపింది. ప్రస్తుతం గవర్నర్ వద్ద పెండింగులో ఉన్న బిల్లులు ఆమోదించారు. అయితే భద్రాచలాన్ని ఒకే పంచాయతీగా కొనసాగించాలని అత్యధిక శాతం మంది కోరుతున్నారు. ఇదే విషయాన్ని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి దృష్టికి తెచ్చాం. ఈ అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి ఒకే పంచాయతీగా చేసేందుకు చర్యలు చేపడతాం.

కమ్యూనిస్టు పార్టీలతో కలిసి పనిచేస్తా

- వామపక్ష పార్టీల కార్యాలయాలకు వెళ్లిన ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి



సీపీఐ కార్యాలయంలో ఎంపీకి సన్మానం చేస్తున్న భాగం, మహ్మద్ సలాం

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 7: నిత్యం ప్రజాసమస్యలపై పోరాటాలు చేసే కమ్యూనిస్టులతో కలిసి తాను పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నానని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి తెలిపారు. ఆదివారం ఖమ్మం జిల్లా కేంద్రంలోని సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ పార్టీ కార్యాలయాలకు ఎంపీ రఘురామ్‌రెడ్డి వెళ్లి ఆయా పార్టీల రాష్ట్ర, జిల్లా కమిటీల సభ్యులు, నాయకులతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించటంలో వామపక్ష పార్టీలు కీలకంగా పనిచేశాయని రఘురాంరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీపీఐ కార్యాలయంలో జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, సీపీఎం కార్యాలయంలో జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఆధ్వర్యంలో ఎంపీ రఘురామ్‌రెడ్డిని ఆయా పార్టీ కార్యాలయాల్లో సన్మానించారు.

అశ్వారావుపేట ఎస్ఐ శ్రీను మృతి

30న మహబూబాబాద్‌లో ఆత్మహత్యాయత్నం ● హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస



అశ్వారావుపేట, జూలై 7: ఇటీవల ఆత్మహత్యకు యత్నించిన అశ్వారావుపేట ఎస్ఐ శ్రీరాముల శ్రీను(38) హైదరాబాదు యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత మృతి చెందాడు. అశ్వారావుపేట సీఐ, నలుగురు కానిస్టేబుళ్లు తనను వేదింపులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ జూన్ 30న ఎస్ఐ శ్రీను మహబూబాబాద్‌లో కలుపునివారణ మందు తాగాడు. అప్పటినుంచి హైదరాబాదు యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎస్ఐ వారం రోజులు మృత్యువుతో పోరాడి శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత తుదిశ్వాస విడిచారు. తన భర్త ఆత్మహత్యాయత్నానికి అశ్వారావుపేట సీఐ జితేందర్‌రెడ్డి, స్టేషన్‌లో పని

(మిగతా 6వ పేజీలో)

ఆర్టీసీలో రిటన్ టికెట్‌పై 10 శాతం రాయితీ

- రీజనల్ మేనేజర్ అజ్మీరా సరిరాం

ఖమ్మం ఖానాపురంహవేలి, జూలై 7: ఆర్టీసీలో ముందస్తు రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులకు తిరుగు ప్రయాణంలో టికెట్ చార్జీలో 10 శాతం రాయితీ అందిస్తున్నట్లు ఆర్టీసీ ఖమ్మం జిల్లా రీజనల్ మేనేజర్ అజ్మీరా సరిరాం తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సంబంధించి హైదరాబాద్, బెంగుళూరు, శ్రీశైలం, తిరుపతి, శ్రీకాకుళం, విశాఖపట్నం, రూట్లలో తిరిగే రిజర్వేషన్ సౌకర్యం ఉన్న రాజధాని, సూపర్‌లగ్జరీ, డీలక్స్, లహరి సర్వీస్‌లతో పాటు రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా బుక్ చేసుకున్న టికెట్‌తోపాటు తిరుగు ప్రయాణం టికెట్‌ను ఒకేసారి బుక్ చేసుకుంటే 10 శాతం రాయితీని పొందవచ్చని తెలిపారు. ఈ సదుపాయం ఆర్టీసీ ప్రాంగణ రిజర్వేషన్ కౌంటర్లతో పాటు అన్ని వెబ్‌సైట్‌ల ద్వారా బుక్ చేసుకునే సదుపాయం అందుబాటులో ఉందన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు

» మహిళల విభాగం విజేత ఖమ్మం, పురుషుల విభాగం విజేత హైదరాబాద్ జట్టు



ప్రథమస్థానం సాధించిన ఖమ్మం మహిళా జట్టు, హైదరాబాద్ పురుషుల జట్టు

ఖమ్మం స్పోర్ట్స్, జూలై 7: నగరంలోని టీఎన్‌జీవోస్ ఫంక్షన్‌హాలులో జరుగుతున్న 10వ తెలంగాణా రాష్ట్ర సీనియర్ పురుషులు, మహిళల ఇంటర్ డిస్ట్రిక్ట్ పవర్‌లిఫ్టింగ్ పోటీలు ఆదివారం ముగిశాయి. టోర్నీలో పురుషుల విభాగంలో విజేతగా హైదరాబాద్ జట్టు నిలవగా ఖమ్మం, రంగారెడ్డి జిల్లా జట్లు ద్వితీయ స్థానంలో నిలిచాయి. అంతేకాకుండా మహిళల విభాగంలో ఖమ్మం జట్టు ప్రథమ బహుమతి సాధించగా హైదరాబాద్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. నగరంలో రెండు రోజులపాటు జరిగిన ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 150 మంది క్రీడాకారులు హాజరైనారు. పోటీలలో ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు. వారు త్వరలో జరగనున్న జాతీయ పోటీలలో రాష్ట్ర జట్టు తరుపున పాల్గొననున్నట్లు రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ సంఘం బాధ్యులు తెలిపారు. పోటీల అనంతరం విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో సౌత్ ఇండియా పవర్‌లి ఫ్టింగ్ అసోసియేషన్ సెక్రెటరీ కోటేశ్వరరావు, రాష్ట్ర సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రమేష్‌గౌడ్, జోసప్, జిల్లా అధ్యక్షుడు గౌస్‌పాషా, సెక్రెటరీ మనోజ్‌కుమార్, మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షుడు రమేష్ బాబు, క్లాసిక్ జిమ్ నిర్వాహకులు నగీనాచౌదరి తదితరులు పాల్గొన్నారు.

జాలిముడి ఆనకట్టకు పోటెత్తిన వరదనీరు



శనివారం వరకు ఎండిపోయి ఉన్న ప్రాజెక్టు, ఆదివారం పొంగి ప్రవహిస్తున్న జాలిముడి ప్రాజెక్టు,

వైరా/మధిరరూరల్, జూలై 7: జాలిముడి ప్రాజెక్టుకు వరదనీరు పోటెత్తింది. ఆదివారం మధ్యాహ్ననానికి ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండిపోయింది. స్వల్పంగా వరదనీరు ప్రాజెక్టు నుంచి బయటకు ప్రవహిస్తుంది. రాత్రికి రాత్రే ఈ ప్రాజెక్టు నిండిపోవడంతో బ్యాక్ వాటర్ ఆయకట్టు రైతుల్లో ఆనందం వెల్లువిరిసింది. వైరా మండల సరిహద్దుల్లోని మధిర మండలం జాలిముడి వద్ద వైరా నదిపై జాలిముడి ప్రాజెక్టు ఉంది. ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఈ ప్రాజెక్టు పూర్తిగా అడుగంటిపోయింది. శనివారం వరకు చుక్కనీరు లేక వెలవెలబోయింది. ఇసుకమేటలే దర్శనమిచ్చాయి. అలాంటి ఈ ప్రాజెక్టుకు కల్లూరు ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలతో గంగదేవిపాడు, కట్లేరు నుంచి భారీగా వరదనీరు వచ్చిచేరింది. రాత్రికి రాత్రే ఈ జాలిముడి ప్రాజెక్టు నిండిపోయింది. గంగదేవిపాడు నుంచి వచ్చిన వరదనీరు జాలిముడి ఆనకట్ట వెనుకభాగంలో వైరా నదిలో దాదాపు మూడుకిలోమీటర్ల వరకు ఆరేడు అడుగుల లోతులో నిలిచిపోయింది. ఈ బ్యాక్‌వాటర్ ఆధారంగా వైరా మండలంలోని దాచాపురం, గరికపాడు, గన్నవరం, మధిర మండలంలోని జాలిముడి, మల్లారం, ఎన్టీఆర్ జిల్లాలోని నెమలి, ఉమ్మడదేవరపల్లి గ్రామాలకు చెందిన వేలాది ఎకరాల్లోని ఆయకట్టు సాగుకు నీటి లభ్యత రావడంతో ఆరైతుల్లో ఆనందం వెల్లివిరిసింది.

గుబ్బలమంగికి జలకళ


దుమ్ముగూడెం జూలై 7:మండలంలోని ప్రధాన వ్యవసాయ సాగు వనరుల్లో ఒకటైన చినగుబ్బలమంగి ప్రాజెక్టు జలకళ సంతరించుకుంది. ఆదివారం అలుగు పారడంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆయకట్టు పరిధిలోని ఏడు గ్రామాలకు చెందిన సుమారు 2500 ఎకరాల సాగుకు ఏటా నీరందిస్తోంది. చత్తీస్‌ఘడ్ రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న ఈ ప్రాజెక్టు అక్కడి వర్షపు నీటిని ఒడిసిపట్టే విధంగా నిర్మించారు. వానాకాలం పంటల సీజనులో రెండు, మూడు సార్లు ప్రాజెక్టు నిండితే ఆయకట్టు సాగుకు ఢోకా ఉండదు.



అలుగు పోస్తున్న సీజీ ప్రాజెక్టు

విత్తనాలు, ఎరువుల ఎంపికలో తస్మాత్ జాగ్రత్త

» వానాకాలం సాగుకు అప్రమత్తత అవసరం
» ఏమరుపాటుగా ఉంటే మోసపోవడం ఖాయం



ఖమ్మం వ్యవసాయం, జూలై 7: ఆరుగాలం శ్రమకు ఫలితం దక్కాలంటే.. ఆది నుంచి అన్నదాత అప్రమత్తంగా ఉండాలి. దుక్కి దున్నింది మొదలు.. పంట చేతికొచ్చే వరకు సాగుకు సంబంధించి జాగ్రత్తలు పాటించాలి. సాగుకు అవసరం అయ్యే ప్రతి వస్తువు కొనుగోలులో... చేసే ప్రతి పనిలో అప్రమత్తంగా వ్యవహరించాలి. విత్తనాలు, పురుగు మందులు, ఎరువుల కొనుగోళ్లలో జాగ్రత్త అవసరం. వ్యవసాయా ధికారులు, శాస్త్రవేత్తల సలహాలు సూచనలతో ముందుకు సాగాలి..

విత్తనాలు కొనే ముందు..

వ్యవసాయ శాఖ లైసెన్సు పొందిన అధికృత డీలరు నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలి. సరిగా సీల్ చేసి ఉన్న బస్తాలను ధ్రువీకరణ పత్రం (ట్యాగ్) ఉన్న వాటినే ఎంపిక చేసుకోవాలి. బస్తాపై గడువు తేదీ, రకం పేరు, లాట్ నంబరులను గమనించాలి. కొనుగోలు బిల్లుతో పాటు నంబరు, విత్తన రకం, గడువు తేదీ పేర్కొనేలా డీలర్ సంతకంతో కూడిన రసీదు పొందాలి. రైతు సంతకం కూడా బిల్లుపై ఉండేలా చూసుకోవాలి. ప్రైవేటు విత్తన సంస్థలు పెద్ద ఎత్తున చేసే ప్రచారానికి ఆకర్షితులై విత్తనాలు కొనుగోలు చేయవద్దు. విత్తనాన్ని ఎంచుకునే ముందు వ్యవసాయాధికారి, శాస్త్రవేత్తల సూచనలు తీసుకోవడం ఎంతో మంచిది. మార్కెట్‌లో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ సరఫరా చేసిన విత్తనాలు ఉంటే వాటిని తీసుకోవడం ఉత్తమం.

ఎరువులు..

నాణ్యమైన ఎరువులనే వాడాలి. పంటల అధిక దిగుబడికి రసాయన ఎరువులు దోహదం చేస్తాయి. అక్కడక్కడ కొందరు దళారులు నాసిరకం ఎరువులను విక్రయిస్తూ రైతులను మోసం చేస్తున్నారు. ఫలితంగా అమాయక రైతులు పెట్టుబడులు సైతం నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో కొన్ని మెలుకువలు పాటిస్తే నకిలీలను నివారించే ఆస్కారం ఉంది. లైసెన్సు ఉన్న దుకాణంలోనే ఎరువులు కొనాలి. కొనుగోలు చేసిన ఎరువులకు సరైన బిల్లు పొందాలి. బిల్లును జాగ్రత్తగా దాచాలి. డీలర్ బుక్కులో రైతు విధిగా సంతకం చేయాలి. మిషన్ కుట్టు ఉన్న ఎరువులను మాత్రమే కొనాలి. సీసంతో సీలు ఉందోలేదో చూసుకోవాలి. బస్తాపై ప్రమాణిక పోషకాలు, ఉత్పత్తిదారు వివరాలు ఉండాలి. బరువులో అనుమానం వస్తే తూకం వేయించాలి. చిరిగిన, రంధ్రాలు ఉన్న బస్తాలను తిరస్కరించాలి. ఖాళీ సంచులను పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపర్చాలి. ఇటీవల రైతులు సూక్ష్మ పోషకాలపై ఆసక్తి చూపిస్తున్నారు. అందమైన ప్యాకింగ్‌కు ఆకర్షితులు కాకుండా అధికారుల సిఫారసు మేరకు కొనాలి. కొనుగోలు చేసిన ఎరువుల విషయంలో అనుమానం వస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలి. అనుమానం ఉన్న ఎరువులను పరీక్షలకు పంపించేలా అధికారులకు ఫిర్యాదు చేయాలి.

పురుగుమందుల్లో...

చీడపీడల నివారణకు వాడే క్రిమిసంహారక మందుల విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా వ్యవసాయ శాఖ సూచించే మందులనే కొనాలి. లైసెన్సు లేని దుకాణాల నుంచి కొనవద్దు. అవసరానికి మించి కొని నిల్వ చేసుకుంటే మందులు చెడిపోతాయి. లేబుల్ లేని మందు సీసా, ప్యాకెట్ డబ్బాలను కొనరాదు. లేబుల్ మీద ప్రకటించిన మందు పేరు, రూపం, మందు శాతం, పరిమాణం, విష ప్రభావం తెలిపే గుర్తులు, వాడకంలో సూచనలు, జాగ్రత్తలు, విరుగుడు మందులు, బ్యాచ్ నంబరు, వాడాల్సిన గడువు, తయారు చేసిన సంస్థ పేరు, రిజిస్ట్రేషన్ విషయాలు పరిశీలించాలి. అన్ని వివరాలతో బిల్లులు పొందాలి. ఎరువుల, మందుల విషపూరిత స్థాయిని తెలిపేందుకు డైమాండ్ ఆకారంలో తెలుపుతో మరో రంగు వినియోగిస్తారు. వాటి వర్గీకరణ ఇలా ఉంటుంది. ఎరుపు రంగు ఉంటే అత్యంత విష పూరితం. పసుపు రంగు అతి విషపూరితం. నీలి రంగు విషపూరితం. ఆకు పచ్చ రంగు స్వల్ప విషపూరితం.

మందుల నిల్వలో పాటించాల్సిన సూచనలు..

వాడిన మందు సీసా, డబ్బా, ప్యాకెట్‌లను ధ్వంసం చేసి పాతి పెట్టాలి. మందులు కలిపిన వాడిన పాత్రలను ఇతర అవసరాలకు వాడవద్దు. విచక్షణ రహితంగా పురుగుల మందులు వాడవద్దు. గడువు దాటి పోయిన సస్యరక్షణ మందులను కొనుగోలు చేయవద్దు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

» పనిచేసే చోటే నివాసం ఉండాలి
» ప్రజలకు వ్యాధుల నియంత్రణపట్ల అవగాహన కల్పించాలి
» వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రాజేశం
» ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వైద్యాధికారులతో సమీక్ష

ఖమ్మం కలెక్టరేట్/కొత్తగూడెం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): 'సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి.. ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి... పనిచేసే చోటనే వైద్యాధికారులు విధిగా నివాసం ఉండి రోగులకు, ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలను అందించాలని' రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రాజేశం అన్నారు. ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వైద్యాధికారులకు, మెడికల్ ఆఫీసర్లకు సీజనల్ వ్యాధులు నివారణ కార్యక్రమాల పై ఆయన సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, అతిసార, టైఫాయిడ్ లాంటి వ్యాదులు రాకుండా చేపట్టాల్సిన చర్యలు, నివారణ కార్యక్రమాలు గురించి వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో డ్రై డే, ఫ్రైడే కార్యక్రమాలు, చేపట్టాలని సూచించారు. ప్రతి పాజిటివ్ కేసును, హై రిస్క్ గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి అన్ని శాఖల సిబ్బంది తో వైద్యాధికారులు సమన్వయం చేసుకుని క్షేత్రస్థాయిలో పనిచేయాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటి ఇంటి సర్వే నిర్వహించడం, పనిచేసే చోటనే వైద్యాధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖధికారి డాక్టర్ సైదులు పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నివారణ కార్యక్రమాలు పగడ బందీగా నిర్వహిస్తేనే ప్రజలు రోగాలు బారిన పడకుండా చేయవచ్చన్నారు. డీటీసీవో డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ క్షయ వ్యాధి నివారణ కార్యక్రమాలు పరీక్షలు, చికిత్స ప్రజల లో అవగాహన పెంచి నివారణ కార్యక్రమాల ను అమలు చేసి టీబి నియంత్రణ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి డాక్టర్ సీతారాం, ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ప్రమీల వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు



కొత్తగూడెంలో హాజరైన అధికారులు

కొత్తగూడెం (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలలో వచ్చే సీజనల్ వ్యాధులను నియంత్రణకు అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని టీబీ జాయింట్ డైరెక్టర్ రాజేశం అన్నారు. ఆదివారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో వివిధశాఖల జిల్లా అధికారులు, వైద్యశాఖ అధికారులు, ఎంపీడీవోలు, పంచాయతీ సెక్రటరీలతో టీబీ జాయింట్ డైరెక్టర్ రాజేషం సమీక్ష సమవేశం నిర్వహించారు. వైద్యశాఖ అధికారులు జిల్లాలో సీజనల్ వ్యాధులు నియంత్రణకు చేపడుతున్న చర్యలు తీసుకుంటున్న జాగ్రత్తలుపై జాయింట్ డైరెక్టర్‌కు వివరించారు. వైద్యశాఖ అధికారులను, ఎంపీడీవోలను పంచాయతీ సెక్రటరీలను వారి పరిధిలో సీజనల్ వ్యాధులు నియంత్రణకు చేపడుతున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వానాకాలంలో మలేరియా, ఫైలేరియా, మెదడువాపు, డెంగ్యూ, చికెన్‌గున్యా, టైఫాయిడ్, డయేరియా, అతిసార వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. డీడీ ట్రైబల్ వెల్ఫేర్ మణెమ్మ మాట్లాడుతూ జిల్లాలో గిరిజన ఆశ్రమ పాఠశాలలో వ్యాధులు ప్రబలకుండ అన్ని జాగ్రత్తలు తీసు కుంటున్నామన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్, జిల్లా మలేరియా అధికారా స్పందన, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, బీసీ సంక్షేమ అధికారి ఇందిరా, డీటీసీవో శ్రీనివాస్, జిల్లా అదనపు వైద్యశాఖ అధికారి సుకృత, జిల్లా అధికారులు, జిల్లా వైద్యశాఖాధికారులు, ఎంపీడీవోలు, సెక్రటరీలు పాల్గొన్నారు.



ఖమ్మంలో మాట్లాడుతున్న జేడీ డాక్టర్ రాజేశం

ఏపీ సీఎం చంద్రబాబుతో
తుమ్మల భేటీ

విభజన, సరిహద్దు సమస్యల పరిష్కారానికి విజ్ఞప్తి

ఖమ్మం, జూలై 7(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఏపీ సీఎం చంద్రబాబునాయుడిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఆదివారం మంత్రి తుమ్మల మర్యాదపూర్వకం గా కలిశారు. ఈ సందర్భంగా విభజన, సరిహద్దు సమస్యల పరిష్కారానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా తెలుగురాష్ట్రాల అభివృద్ధికి సబంధించి పలు అంశాలపై చర్చించారు. అందులో భాగంగా పట్టిసీమ నుంచి ప్రకాశం బ్యారేజ్‌కు అక్కడ నుంచి పులిచింతలకు గోదావరి జలాలు తరలింపు భవిష్యత్‌లో కీలకం కానున్నాయని అన్నారు. తెలంగాణాలో రైల్వేలైన్ల విస్తరణకు సహకరించాలని తుమ్మల ఆకాంక్షించారు. సత్తుపల్లి నుంచి కోవ్వూరు రైల్వేలైన్, పెనుబల్లి నుంచి కొండపల్లి రైల్వేలైన్ పనులు పూర్తయితే ఏపీ తెలంగాణ రాష్ట్రాలకు ఎంతో ప్రయోజనకరంగా మారనున్నాయని తుమ్మల సూచించారు. ఇరు రాష్ట్రాలు అన్నదమ్ముల్లా విడిపోయినా అభివృద్ధిలో కలసి సాగాలని తుమ్మల నాగేశ్వరరావు కోరారు. జల వివాదాలు లేకుండా రెండు తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి పథంలో సాగేందుకు చంద్రబాబు అనుభవం ఎంతో దోహదం చేస్తుందని తుమ్మల విశ్వాసం వ్యక్తం చేశారు. ఏపీలో విలీనమైన ఐదు పంచాయతీలను తెలంగాణాలో కలిపేందుకు కృషిచేయాలని తుమ్మల కోరారు. చాలాకాలం తర్వాత తమ్మల చంద్రబాబునాయుడిని కలవడంతో ఒకరినొకరు ఆప్యాయంగాపలుకరించుకున్నారు.

ఉమ్మడి జిల్లా పుట్‌బాల్ జట్టు ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్, జూలై 7: జిల్లా పుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వీవీపాలెం ప్రభుత్వ పాఠశాల మైదానంలో ఉమ్మడి జిల్లా సబ్ జూనియర్ బాలికల జటును ఎంపిక చేశారు. ఎంపికలకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి సుమారు 43 మంది క్రీడాకారిణులు హాజరైనారు. ఎంపికల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారిణుల వివరాలను జిల్లా పుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి కళ్యాణపు ఆదర్శ్‌కుమార్ ప్రకటించారు. జట్టులో శృతి, జాస్మిత, చర్విత, హారిక, జయశ్రీ, అనిత, తన్మశ్రీ, పి. తనుశ్రీ, శరణ్య, లతిక, దీప్తి, హాసిని, రేణుక, కీర్తి, యమున, ఉమశ్రీ, ధనవర్ష, యాషిత, మీరాకుమారి, శిల్ప ఎంపికైనట్లు తెలిపారు. వారు ఈనెల 11 నుంచి కల్వకుర్తిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. ఎంపికలను పీఈటీలు క్రిష్ణయ్య, శ్రీదేవి, సీనియర్ ప్లేయర్లు ఆశిత్‌సాయి, గోపీచంద్, శివ, గోపి తదితరులు సమీక్షించారు.

వీరభద్రాచారికి డాక్టరేట్

» ఆయుర్వేద వైద్యసేవలకు 20న ఢిల్లీలో అవార్డు ప్రదానం



ఖమ్మం కలెక్టరేట్, జూలై 7: ఆయుర్వేదంలో విశిష్ట సేవలు అందించి నందుకు గాను ఖమ్మం జిల్లాకు చెందిన రామడుగు వీరభద్రాచారికి ఐకానిక్ పీస్ అవార్డు కౌన్సిల్, న్యూఢిల్లీ వారిచే గుర్తింపు పొందారు. ఈ నేపథ్యంలో గౌరవ డాక్టరేట్ అవార్డుకు ఎంపిక చేశారు. ఖమ్మంలోని వీడీవోస్ కాలనీకి చెందిన రామడుగు వీరభద్రాచారి రెండు తరాలుగా ఆయుర్వేద వైద్యునిగా నిరుపేద, మధ్య తరగతి వర్గాలకు దాదాపు 430 మందికి సురక్షిత కాన్పుల వైద్య సేవలు అందించినందుకు గాను ఆయనకు ఈ అవార్డు దక్కింది. ఈనెల 20న ఐకానిక్ పీస్ అవార్డు కౌన్సిల్ వారిచే న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియా, రఫీ మార్గ్ లో వీరభద్రాచారి కి అవార్డు ప్రదానం చేయనున్నారు. ఖమ్మం జిల్లాలో ఆయన పంచాయతీ అధికారి గా వివిధ హోదాలలో ఆయన విధులు నిర్వహించారు. 2015లో ఆయన పదవి విరమణ పొందారు. వీరభద్రాచారి డాక్టరేట్ అవార్డుకు ఎంపిక కావడం పట పలువురు అభినందిస్తున్నారు.

రైతు ప్రభాకర్ కుటుంబాన్ని ఆదుకుంటాం

» ఆత్మహత్యకు పురిగొల్పిన వారిని ఉపేక్షించేది లేదు
» డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
» పొద్దుటూరులో బాధిత కుటుంబానికి పరామర్శ
» నిష్పక్షపాతంగా విచారణ చేయాలని పోలీసులకు ఆదేశం

చింతకాని, జులై 7: తన పొలాన్ని ధ్వంసం చేశారనే ఆవేదనతో ఆత్మహత్య చేసుకున్న చింతకాని మండలం పొద్దుటూరుకు చెందిన రైతు బోజడ్ల ప్రభాకర్ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. రైతు ఆత్మహత్యకు పురిగొల్పినవారిని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. రైతు ప్రభాకర్ ఆత్మహత్య బాధాకరమన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదివారం ఆయన పరామర్శించారు. తొలుత రైతు ప్రభాకర్ వ్యవసాయ భూమిని పరిశీలించిన భట్టి ఆ భూమికి వెళ్లేందుకు దారి, చెరువు శిఖం తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని రైతు ఇంటికి వెళ్లి ప్రభాకర్ చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చి వారిచ్చిన వినతిపత్రాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క విలేకరులతో మాట్లాడుతూ తన భూమిలో వేసిన మట్టిని చేపల సొసైటీ వారు తొలగించారని మనస్థాపం చెంది రైతు ఆత్మహత్య చేసుకున్నట్లు మీడియా, ఇతరుల ద్వారా తెలిసిందన్నారు. రైతు ఆత్మహత్యకు ప్రేరేపించిన వారు ఎవరైనా, ఎంత పెద్దవారైనా నిష్పక్షపాతంగా విచారణ చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. కేసులకు పార్టీలకు సంబంధం లేదన్నారు. ఏ పార్టీ వారైనా ఉపేక్షించేది లేదన్నారు. రైతు ప్రభాకర్ భూమికి సంబంధించిన సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్‌ను ఆదేశించినట్లు తెలిపారు. రైతు ప్రభాకర్ పిల్లలు చదువులకు అవసరమైన ఏర్పాట్లు ప్రభుత్వం చేస్తుందన్నారు. ఆత్మహత్యల వంటి చర్యలకు పాల్పడవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం కేసులో నేరారోపణ ఎదుర్కొంటున్న కాంగ్రెస్ నాయకుడి ఇంటికి వెళ్లిన భట్టి ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఎండీ ముజామ్మిల్‌ఖాన్, ఆర్‌డీవో గణేష్, మండల అధికారులు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, దొబ్బల సౌజన్య, అంబటి వెంకటేశ్వర్లు, మడిపల్లి భాస్కర్, కిలారు మనోహర్‌బాబు, కొప్పుల గోవిందరావు, బందెల నాగార్జున, పెంట్యాల అప్పారావు, కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, ప్రసాద్ తదితరలు పాల్గొన్నారు. ఒకే రోజు ఉపముఖ్యమంత్రి భట్టి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుల పర్యటన నేపథ్యంలో ఎటువంటి ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



: రైతు ప్రభాకర్ భూమిని పరిశీలిస్తున్న భట్టి

రైతు ఆత్మహత్యకు కారకులైన వారిని
కఠినంగా శిక్షించాలి

» ఖమ్మం సీపీ సునీల్‌దత్‌ను కలిసిన బీఆర్‌ఎస్ ప్రతినిధి బృందం
» బాధిత కుటుంబానికి రెండు లక్షల ఆర్థిక సాయం

ఖమ్మంకార్పొరేషన్/చింతకాని, జూలై 7: ఖమ్మం జిల్లా చింతకాని మండలం ప్రొద్దుటూరుకు చెందిన రైతు బోజెడ్ల ప్రభాకర్ ఆత్మహత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని బీఆర్‌ఎస్ ప్రతినిధి బృందం ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌ను కోరింది. బీఆర్‌ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి, మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, రాష్ట్ర నాయకులు ఏనుగు రాకేష్‌రెడ్డిలు ఆదివారం సీపీని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రొద్దు టూరు రెవెన్యూలోని సర్వేనెంబర్ 276,277లో బోజెడ్ల ప్రభాకర్‌కు చెందిన భూమిని బలవంతంగా ఆక్రమిం చటమే కాకుండా, ప్రొక్లెయినర్లు, డోజర్లతో కట్టను ధ్వంసం చేసి, సదరు భూమిని చెరువులోకి కలిపారని వినతిపత్రం ద్వారా బీఆర్‌ఎస్ ప్రతినిధి బృందం సీపీకి తెలిపారు. బాధితుడైన బోజెడ్ల ప్రభాకర్‌కు అండగా చింతకాని మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన పెంట్యాల పుల్లయ్య అధికారులను కలిసి సహకరించారని సీపీకి తెలిపారు. కాగా పెంట్యాల పుల్లయ్య ఎటువంటి అక్రమాలకు పాల్పడలేదని, అయినా అతడిపై పోలీసులు అక్రమంగా కేసు బనాయించి, ఏ-3గా చూపుతున్నారని బీఆర్‌ఎస్ ప్రతినిధి బృందం తెలిపింది. ప్రొద్దుటూరుకు చెందిన కూరపాటి కిషోర్, పెంట్యాల రామారావు, మరో 8మంది భూ ఆక్రమణ చేశారని, దీనిపై సమగ్ర విచారణ చేసి, చర్యలు తీసుకోవాలని కోరారు. బోజెడ్ల ప్రభాకర్‌కు చెందిన 7-10 ఎకరాల భూమిని ఆయన కుటుంబానికి చెందేటట్లు చర్యలు తీసుకోవాలని, పొలానికి వెళ్లే దారిని పునరుద్దరించేలా సంబంధిత అధికారులకు ఆదేశించాలని కోరారు. రైతు ప్రభాకర్ కుటుంబానికి రూ.25లక్షల ఎక్స్‌గ్రేసియా ఇవ్వాలని, ఆయన కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, అలాగే చింతకాని మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్యపై అక్రమ కేసులను ఎత్తివేయాలని బీఆర్‌ఎస్ ప్రతినిధి బృందం సీపీ సునీల్‌దత్‌ను కోరింది.



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే రాజేశ్వరరెడ్డి

బాధిత కుటుంబానికి రెండు లక్షల ఆర్థిక సహాయం

పొద్దుటూరు గ్రామంలో రైతు బొజడ్ల ప్రభాకర్ కుటుంబాన్ని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుల బృందం ఆదివారం పరామర్శించింది. న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని నాయకులు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ తరపున రూ.2లక్షల సాయం అందజేశారు. అనంతరం మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి న్యాయం జరగడం లేదన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు వస్తున్నారని తెలుసుకుని ఆదివారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ఉపముఖ్యమంత్రి భట్టి ఖాళీ చేతులతో వచ్చి వారికి స్పష్టమైన భరోసా ఇవ్వకుండా వెళ్లారన్నారు. రెవెన్యూ, వ్యవసాయ మంత్రులకు బాధిత కుటుంబాన్ని పరామర్శించడానికి తీరక లేదా అని ప్రశ్నించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన భట్టి అనంతరం ఈ ఘటనకు కేసులో నిందితుడిగా ఉన్న కాంగ్రెస్ నాయకుడి ఇంటికి వెళ్లి పరామర్శించడం ఏంటని ప్రశ్నించారు. ఘటనకు కారణమైన తహసీల్దార్, ఎస్‌ఐలను వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు. ఈ కేసు విషయంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని, వారు ఫలితం అనుభవించక తప్పదన్నారు. అనంతరం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుల బృందం కేసులో ఏ-3గా ఉన్న బీఆర్‌ఎస్ చింతకాని మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ తాత మధు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, రాష్ట్ర నాయకుల ఏనుగుల రాకేష్‌రెడ్డి, ఆర్‌జేసీ కృష్ణ, పగడాల నాగరాజు, గురిజాల హనుమంతరావు, మంకెన రమేష్, బొడ్డు వెంకటరామయ్య, వంకాయలపాటి లచ్చయ్య, ముదిగొండ మండల అధ్యక్షుడు వాచేపల్లి లక్ష్మారెడ్డి, చిత్తారు సింహాద్రి యాదవ్ తదితరలు పాల్గొన్నారు.

అశ్వారావుపేట ఎస్‌ఐ శ్రీను మృతి

» అశ్వారావుపేటలో దళిత సంఘాలు, సీపీఐ, బీఆర్‌ఎస్‌ల ఆధ్వర్యంలో ఆందోళన
» ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే, పలువురి సంతాపం

(5వ పేజీ తరువాయి)

చేసే నలుగురు కానిస్టేబుళ్ల వేదింపులే కారణమని ఎస్‌ఐ భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. దాంతో సీఐ జితేందర్‌రెడ్డిని ఐజీ కార్యాలయానికి అటాచ్ చేసి, నలుగురు కానిస్టేబుళ్లను వీఆర్‌కు పంపారు. మహబూబాబాద్ పోలీసులు వీరందిరిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ మృతి చెందటంతో ఆదివారం పలు దళిత సంఘాలు, ఆదివాసీ సంఘాలు, సీపీఐ, బీఆర్‌ఎస్ పార్టీల ఆధ్వర్యంలో అశ్వారావుపేటలో ఆందోళన చేసి, పోలీస్‌స్టేషన్ ముందు ధర్నా నిర్వహించారు. ఎస్‌ఐ మృతికి కారకులైనవారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ ఎస్‌ఐ కరుణాకర్‌కు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ కుటుంబానికి రూ.కోటి పరిహారం చెల్లించాలని, ఆయన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని బీఆర్‌ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే మెచ్చ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఎస్‌ఐ మృతి పట్ల తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఎస్‌ఐ మృతదేహన్ని ఆయన స్వగ్రామం వరంగల్ జిల్లా, నల్లబెల్లి మండలం, నారక్కపేటకు ఆదివారం తీసుకురావడంతో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్, పోలీస్ సంఘం నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

"సీఐపై ఆరోపణలు సరికాదు"

అశ్వారావుపేట ఎస్‌ఐ శ్రీరాముల శ్రీను మృతి విచారకరమని, కానీ ఆయన మృతికి సీఐ జితేందర్‌రెడ్డి కారణమని ఆరోపణలు చేయటం సరికాదని సీఐ భార్య శైలజ శనివారం రాత్రి విడుదల చేసిన ఓ వీడియో సందేశంలో తెలిపారు. మాదిగ సామాజికవర్గానికి చెందిన తనను సీఐ జితేందర్‌రెడ్డి 2016లో ప్రేమించి వివాహం చేసుకున్నారని, ఎస్సీ వర్గానికి చెందిన తనను ఇంట్లో పెట్టుకుని అదే సామాజికవర్గానికి చెందిన ఎస్‌ఐ శ్రీనును సీఐ జితేందర్ రెడ్డి అగ్రకుల అహంకారంతో వేధింపులకు గురిచేశారని ఆరోపణలు చేయటం సరికాదన్నారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేసి అందరికీ న్యాయం చేయాలని శైలజ ప్రభుత్వాన్ని కోరారు.



నివాళులర్పిస్తున్న అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే, సీఐ కరుణాకరణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న దళితసంఘాలు

గోదావరి నీళ్లే శరణ్యం!

▸ వైరా రిజర్వాయర్ అడుగంటడంతో రైతుల ఆందోళన ▸ ఇప్పటికే యాసంగి సాగు దూరం ▸ ఇప్పుడు వానాకాలంపైనా సందేహాలు

▸ సీతారామ ప్రాజెక్టు లింక్ కెనాల్‌పైనే ఆశలు ▸ ఆగస్టు 15 నాటికి జలాలు తీసుకువస్తామన్న మంత్రి తుమ్మల

ఈ ఏడాది యాసంగి సాగును కోల్పోయిన వైరా రిజర్వాయర్ పరిధిలోని 25వేల ఆయకట్టు రైతాంగానికి వానాకాలం వ్యవసాయ సీజన్ కూడా ఆశాజనకంగా లేదు. వైరా ఆయకట్టులో వానాకాలం పంటల సాగుకు గోదావరి నీళ్లు వస్తేనే రైతుల ఆశలు ఫలించనున్నాయి. ఈ ఏడాది జూలై వచ్చినప్పటికీ రిజర్వాయర్ నీటిమట్టం గణనీయంగా తగ్గి అడుగంటిపోయింది. ఈ సీజన్‌లో అడపాదడపా వర్షాలు కురుస్తున్నప్పటికీ రిజర్వాయర్‌లోకి చుక్కనీరు రాలేదు. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 18.3అడుగులు కాగా, ప్రస్తుతం 5.6అడుగులకు పడిపోయింది.

వైరా, జూలై 7: గత బీఆర్ఎస్ ప్రభుత్వ ఆదేశాలతో వైరా రిజర్వాయర్ కుడి, ఎడమకాల్వల ఆయకట్టు రైతులు యాసంగి పంట సాగుచేయలేదు. నాగార్జున్ సాగర్‌లో సైతం ఆశించిన మేరకు నీరు లేకపోవడంతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులెవరూ యాసంగిలో వరి సహా ఇతర ఆరుతడి పంటలు సాగుచేయవద్దని వ్యవసాయశాఖ ద్వారా గ్రామాల్లో సదస్సులు పెట్టించి హెచ్చరికలు జారీ చేయించింది. వైరా రిజర్వాయర్ నుంచి 11మండలాల్లోని ప్రజలకు మిషన్ భగీరథ ద్వారా మంచినీటిని అందించేందుకుగానూ సాగునీటి సరఫరాను నిలిపివేశారు. ఫలితంగా ఆయకట్టు రైతులు యాసంగి సాగుకు దూరంగా ఉండిపోయారు.

నిరాశజనకంగా వానాకాలం సాగు...

యాసంగి సీజన్‌ను నష్టపోయిన తమకు వానాకాలం వ్యవసాయ సీజన్ అయినా కలిసివస్తుందని ఎదురుచూస్తున్న ఆయకట్టు రైతులకు నిరాశమే మిగిలింది. అత్యవసర వర్షాల కారణంగా వరదలు లేక రిజర్వాయర్ నీటిమట్టం పెరగలేదు. కనీస నీటిమట్టానికి పడిపోయింది. ఉన్న నీటిని మిషన్ భగీరథ అవసరాలకే ఉపయోగిస్తున్నారు. ప్రధాన కుడి, ఎడమకాల్వల హెడ్ స్లూయిస్ ముందు భాగంలో మట్టితో రింగ్‌బండ్ వేసి చుక్కనీరు కూడా కాల్వలోకి రాకుండా అధికారులు చర్యలు చేపట్టారు. కొద్దిపాటి వర్షాలకు రైతులు పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకున్నారు. వరినార్లు పోసుకొనేందుకు నారుమళ్లు సిద్ధం చేశారు. కొంతమంది రైతులు దమ్ములు చేసి నేరుగా వరి విత్తనాలు చల్లుకోవడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. వరి విత్తనాలు కొనుగోలు చేసి సాగుకు సిద్ధంగా ఉన్నప్పటికీ రిజర్వాయర్‌లో నీళ్లు లేక అన్నదాతలు నిరాశతో ఉన్నారు.

గోదావరి నీళ్లపైనే ఆశలు ...

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఏడాది ఆగస్టు 15నాటికి సీతారామ ప్రాజెక్టు నుంచి లింక్ కెనాల్ ద్వారా వైరా రిజర్వాయర్‌కు గోదావరి జలాలను ఇవ్వటానికి చేస్తున్న ప్రయత్నాలు ఫలించాలని ఆయకట్టు రైతులు వేడుకుంటున్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దీక్షతో గోదావరి జలాలను వైరాకు తీసుకువచ్చేందుకు అన్నిస్థాయిల్లో విశేష కృషిచేస్తున్నారు. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ తమవంతు సహకారాన్ని అందిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ఆగస్టులో గోదావరి నీళ్లను లింక్ కెనాల్ నుంచి వైరాకు అందిస్తామని తుమ్మల పదేపదే ప్రకటించారు. లింక్ కెనాల్‌కు అవసరమైన నిధులను భట్టి విక్రమార్క విడుదల చేశారు. లింక్ కెనాల్ నిర్మాణ పనులు చురుగ్గా జరిగేలా మంత్రి తుమ్మల నిత్యం పరిశీలిస్తూ అవసరమైన ఆదేశాలు ఇస్తున్నారు. ఇతరత్రా ఉన్న అడ్డంకులను అధిగమించేందుకు కూడా ఆయన ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. గోదావరి నీళ్లు వైరాకు వస్తే ఆలస్యంగానైనా ఆయకట్టులో పంటల సాగుకు అవకాశముంటుందని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.



అడుగంటిన వైరా రిజర్వాయర్

ఇతర ప్రాంతాల్లోని భూములు సస్యశ్యామలం..

వైరాకు గోదావరి జలాలు రావడం వలన కేవలం ఈ ఆయకట్టుకే కాకుండా పలు ప్రాంతాల్లోని వ్యవసాయ భూములు కూడా సస్యశ్యామలం అవుతాయి. ముఖ్యంగా వైరా, సత్తుపల్లి, మధిర నియోజకవర్గాల పరిధిలోని వైరా, తల్లాడ, బోనకల్, మధిర అలాగే ఎన్టీఆర్ జిల్లాలోని గంపలగూడెం, వీరులపాడు తదితర మండలాల్లోని భూములకు వైరా నది, కట్టలేరు ద్వారా పుష్కలంగా సాగునీరు అందుతుంది. వైరా లింక్ కెనాల్ నిర్మాణం కోసం ఈ ఏడాది మార్చి 13న మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల, పొంగులేటి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. జూలూరుపాడు మండలంలోని వినోభానగర్ నుంచి ఏన్కూరు మండలంలో ఉన్న ఎన్నెస్పీ 21ఎంబీసీ వరకు లింక్ కెనాల్‌ను నిర్మించి అక్కడ అనుసంధానం చేయనున్నారు. ఆ ఎన్నెస్పీ కాల్వపై ఉన్న ఎస్కేప్ లాకుల ద్వారా పగిడేరులోకి గోదావరి జలాలు విడుదల చేస్తే ఆనీళ్లు 20కిలోమీటర్ల దూరంలో ఉన్న వైరా రిజర్వాయర్‌కు చేరతాయి. ఫలితంగా వైరా ఆయకట్టుతోపాటు పైన పేర్కొన్న మండలాల్లోని రైతుల భూముల కు కూడా సాగునీరు పుష్కలంగా సరఫరా అవుతుంది.

ఉమ్మడి జిల్లా స్థాయి స్విమ్మింగ్ జట్టు ఎంపిక

చుంచుపల్లి, జూలై7: ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల స్విమ్మింగ్ జట్టును ఎంపిక చేసినట్లు జిల్లా అసోసియేషన్ జనరల్ సెక్రటరీ హన్మంత్‌రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 16 మంది సభ్యులతో జట్టును ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఎంపికైన ఈ క్రీడాకారులు ఈ నెల 13, 14వ తేదీలలో సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ స్విమ్మింగ్ పూల్ నందు జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో ఉమ్మడి జిల్లా తరుపున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఈ ఎంపికలను కొత్తగూడెం సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించి గ్రూప్-1, 2, 3 విభాగాలలో ప్రదర్శన కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేశారు. ఎంపికైన వారిలో భద్రాద్రి జిల్లా నుంచి సాయిశ్రీ వాస్తవ్, ఛత్రపతినాథ్, నాగచైతన్య, మాన్విత్, జహోన్‌తెడ్, మోక్షశ్రీ, నక్షత్ర, గాయత్రి, చేతన్ ఉన్నారు. ఖమ్మం జిల్లా నుంచి కె.పవన్, బి.తేజస్, కె.కేశవ్, మోక్ష చంద్రశేఖర్‌రావు, ప్రతిక్‌సింగ్, కార్తీక్‌టుత్వాన్, ఆదేష్‌వల్లూస్‌లు ఉన్నారు. ఎంపికైన వారికి ఉమ్మడి జిల్లాల స్విమ్మింగ్ పూల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంఎల్.నరసింహం, ట్రెజరర్ పాత్నెట్, సభ్యులు నరహరి, సామ్యూల్, సంధ్యారాణి, రాంబాబు, తదితరులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

కొత్తగూడేనికి ఆహోబిలం చినజీయర్ రాక



భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తున్న ఆహోబిలం చినజీయర్ స్వామి

కొత్తగూడెం సాంస్కృతికం, జూలై7: హిందూ ధర్మ పరిరక్షణ కోసమే దేవాలయాలను సందర్శిస్తున్నట్లు ఆహోబిలం చినజీయర్‌స్వామి ఉద్ఘాటించారు. ఆదివారం కొత్తగూడెం విద్యానగర్‌లోని శ్రీపద్మావతి గోదా సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని ఆయన సందర్శించారు. చినజీయర్ స్వామికి ఆలయ నిర్వాహకులు దేవాదాయ సంప్రదాయబద్ధంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ స్వామి మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణతోనే లోక కల్యాణం సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు చిగురుపాటి శ్రీనివాస్, పివి వర్ధన్‌రావు, వాసిరెడ్డి ప్రసాద్, అర్చకులు గోపాలాచార్యుల శిష్యబృందం, భక్తులు పాల్గొన్నారు.

గ్రూప్-1 మెయిన్స్‌కు అర్హత సాధించిన తండ్రి కొడుకులు



మెయిన్స్‌కు అర్హత సాధించిన తండ్రికొడుకులు కిరణ్, ఇమ్మానియేల్

కామేపల్లి, జూలై 7: గ్రూప్-1 ప్రిలిమ్స్ ఫలితాల్లో మెయిన్స్‌కు తండ్రి కొడుకులు అర్హత సాధించారు. ఖమ్మం పట్టణానికి చెందిన దాసరి కిరణ్ (53) కామేపల్లి మండలం ఎంజేపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. కుమారుడు దాసరి ఇమ్మానియేల్(25) ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమవుతున్నాడు. కాగా ఇరువురు పరీక్ష రాయగా గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి, ఆదివారం విడుదలైన మెయిన్స్‌కు అర్హత సాధించారు. గత రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్-1 పరీక్షా ఫలితాల్లో ఇద్దరు అర్హత సాధించడం గమనార్హం.

'విద్యుత్ బిల్ కలెక్టర్లను ఆదుకోవాలి'

తల్లాడ, జూలై 7: విద్యుత్ సంస్థలో 30ఏళ్లుగా విద్యుత్ బిల్లులు వసూలు చేసేందుకు కమీషన్ పద్ధతిలో పనిచేసిన విద్యుత్ బిల్ కలెక్టర్లను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర కమిటీ సభ్యుడు కొలగాని రమేష్ డిమాండ్ చేశారు. ఆదివారం తల్లాడలో ఉమ్మడి ఖమ్మం జిల్లా విద్యుత్ బిల్ కలెక్టర్ల సమావేశం బోడపట్ల కృష్ణయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మార్చి నుంచి ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ వినియోగదారులకు 80శాతం జీరో బిల్లు వస్తుందని, విద్యుత్ బిల్‌కలెక్టర్లకు బిల్లు వసూలు చేస్తేనే వాటిపై వచ్చే కమీషన్ అందుతుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం ప్రత్యామ్నాయంగా బిల్ కలెక్టర్లకు సంస్థలో అమలుచేస్తున్న జీవోనెంబర్ 11ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో స్తంభాద్రి ఎలక్ట్రిసిటీ మ్యూచువల్ ఎయిడ్ కాంట్రాక్టు లేబర్ సొసైటీ మేనేజర్ ఎన్‌జీవీ.నాగేశ్వరరావు, డైరెక్టర్లు నగేష్, సత్యనారాయణ, శ్రీను, రాజశేఖర్‌రెడ్డి, గుర్నాథం, రాంబాబు పాల్గొన్నారు.

భర్త వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

ఖమ్మం రూరల్, జూలై 7: భర్త, అత్త,మామ, ఆడబిడ్డల వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఖమ్మం రూరల్ మండలం, మద్దులపల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన షేక్.నజీర్‌కు బోనకల్ మండలం, ముష్టికుంట్ల గ్రామానికి చెందిన షేక్.జునేరియా(21)తో గత మూడేండ్ల క్రితం వివాహం జరిగింది. గత కొంతకాలంగా వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ గొడవల నేపథ్యంలో జునేరియా తన పుట్టింటికి వెళ్లిపోయింది. ఇటీవల పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీ జరిగిన తరువాత ఆమె తన భర్త నజీర్ వద్దకు వచ్చింది. అయినప్పటికీ భర్త అత్త, ఆడబిడ్డల వేధింపులు మాత్రం మానలేదు. తరుచూ ఆమె వేధిస్తుండడంతో ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మ హత్య చేసుకుంది. అప్పుడే ఇంటికి చేరిన భర్త నజీర్ జునేరియాను పిలిస్తే ఎంతకి తలుపులు తీయకపోవడంతో పక్కవారి సహాయంతో తలుపులు పగలకొట్టి చూసేసరికి ఫ్యానుకు ఉరివేసుకుని ఉంది. వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. జునేరియా ఆత్మహత్యకు భర్త, అత్త, ఆడబిడ్డలే మానసికంగా, శారీరకంగా వేధించడం మూలంగానే నా కుమార్తె ఆత్మహత్య చేసుకుందని, మృతురాలి తండ్రి ముస్తాఫా ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ

టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు అఫ్జల్‌హాసన్

ఖమ్మం కలెక్టరేట్, జూలై 7: టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు అఫ్జల్ హాసన్ ఆత్మహత్యాయత్నం చేశారు. గత రెండున్నరేళ్లుగా ఆయన టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు. అయితే ఇటీవల సంతకాల ఫోర్జరీ, అసలును పోలిన నకిలీ ధ్రువీకరణ పత్రాల రూపొందించినట్లు అఫ్జల్ హాసన్ పై అభియోగాలు, ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో ఆయనను పోలీసులు అరెస్ట్ చేసి జైలుకి పంపించారు. గత మూడు రోజుల క్రితం జైలు నుంచి వచ్చిన తీవ్ర మనస్తాపంతో ఉన్నట్లు తెలిసింది. దీంతో శనివారం రాత్రి ఎక్కువ మోతాదులో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తీవ్ర అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఆయనను నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆయన పరిస్థితి కాస్త విషమించిందని 24 గంటలు దాటితే కానీ చెప్పలేమని వైద్యులు చెబుతున్నారు. అయితే కుటుంబ సభ్యులు పోలీసులు, యూనియన్ నేతల ఒత్తిడి, వల్లనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడంటూ ఆరోపిస్తున్నారు. అయితే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అఫ్జల్‌హాసన్‌ను ఆదివారం పలువురు పరామర్శించారు.

కమ్యూనిస్టులతోనే ప్రజా సమస్యల పరిష్కారం

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 7: కమ్యూనిస్టులతోనే ప్రజా సమస్యల పరిష్కారమవుతాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం గ్రామ శాఖ సీపీఎం పార్టీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. ప్రజా సమస్యలున్నంత వరకు దేశంలో కమ్యూనిస్టు పార్టీలు ఉంటాయని అన్నారు. మతోన్మాద విధానాలను తిప్పికొట్టేది కమ్యూనిస్టు నాయకులేనన్నారు. జాతీయ స్థాయిలో ఇండియా కూటమితో రాజ్యాంగానికి రక్షణ కలిగిందని పేర్కొన్నారు. ఎన్‌డీఏ కూటమికి 370 ఎంపీ సీట్లు గెలిచి ఉంటే ఇప్పటికే రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నాలు ప్రారంభించే వారని ఆరోపించారు. మతోన్మాద విధానాలను తిప్పికొట్టేందుకు ప్రజల్లోకి అవగాహన చొచ్చుకు పోతే సమాజానికి అంత మంచిదన్నారు. కమ్యూనిస్టుల పార్టీలకు ఓట్లు, సీట్లు సంఖ్య ముఖ్యం కాదన్నారు. ప్రజాస్వామ్య, లౌకిక విధానాలను కాపాడేందుకు సీపీఎం పార్టీ ముందుంటుందన్నారు. నిరుపేదలకు భూమి పంచాలి, కూలీ పెంచాలి, ఎస్సీ ఎస్టీలు, మహిళలకు హక్కుల రక్షణ కల్పించాలని పోరాడేది కమ్యూనిస్టు పార్టీలే అన్నారు. రాజ్యాంగ సంస్థలు సైతం బీజేపీ ప్రభుత్వానికి అనుబంధ సంస్థలుగా మారాయన్నారు. జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతాంగ ఉద్యమాలు, కార్మిక సంఘాలు బలంగా ఉన్న ప్రాంతాల్లో బీజేపీ ఓటమిపాలైందన్నారు. పార్టీ అర్బన్ కార్యదర్శి బత్తిని ఉపేందర్, నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీకాంత్, వై విక్రమ్, కళ్యాణం వెంకటేశ్వరరావు, ఎస్‌కే మీరా పాల్గొన్నారు.



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న తమ్మినేని వీరభద్రం

క్రిమినల్ చట్టాలను ఉపసంహరించుకోవాలి

▸ దేశ ద్రోహం పేరిట ఇచ్చిన నిర్వచనం రాజ్యాంగ విరుద్ధం

▸ వ్యక్తి స్వేచ్ఛను హరించే చట్టాలు

▸ ఐలు రాష్ట్ర అధ్యక్షుడు కొల్లి సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న కొల్లి సత్యనారాయణ

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 7: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు క్రిమినల్ చట్టాలు అత్యంత దుర్మార్గమైనవని ఐలూ రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన నిర్వహించిన నూతన క్రిమినల్ చట్టాలు అమలు-పర్యవసానాలు, ప్రమాదాల సెమినార్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. వ్యక్తుల స్వేచ్ఛను హరించే విధంగా నూతన చట్టాలను రూపొందించారని పేర్కొన్నారు. దేశ ద్రోహం పేరిట ఇచ్చిన నిర్వచనం రాజ్యాంగ విరుద్ధంగా ఉందని వివరించారు. మూడు చట్టాలున్న శిక్షలను పదేళ్లకు పొడిగించడం ఎంత వరకు సమంజసమన్నారు. ఐపీసీ, సీఆర్పీసీ, ఎవిడెన్స్ యాక్టులను భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సంహిత, భారతీయ సాక్షి సంహితగా మార్చడంతో పాటు కఠినమైన శిక్షలు అమలు చేసేందుకు రూపొందించారని ఆరోపించారు. ఈ చట్టాల మార్పు వెనుక రాజ్యాంగాన్ని మార్చే కుట్ర జరిగిందని ఆరోపించారు. పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం కలుగుతుందన్నారు. ఈ సెమినార్‌లో సీపీఎం జిల్లా కమిటీ కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ఏకపక్షంగా చట్టాలను అమలులోకి తీసుకొచ్చిందని ఆరోపించారు. పౌరుల హక్కులను హరించే చట్టాలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐలూ రాష్ట్ర కార్యదర్శి మందడపు శ్రీనివాస్‌రావు, జిల్లా బార్ కౌన్సిల్ కార్యదర్శి చింతనిప్పు వెంకట్, నల్లమల నవీన్ చైతన్య, మీసాల వెంకటేశ్వర్లు, కళ్యాణం వెంకటేశ్వరరావు, వై విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రెయిన్ స్ట్రోక్‌తో లెక్చరర్ మృతి



కోటేశ్వరరావు (ఫైల్)

మణుగూరు, జూలై 7: మణుగూరు మునిసిపాలిటీ పరిధిలోని శివలింగాపురం గ్రామానికి చెందిన కోటేశ్వరరావు స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు కాలేజీలో మాథ్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. కాగా అతడు గత రెండేళ్లగా బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం అతడి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి...



కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూలై7: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కొత్తగూడెం రైల్వే స్టేషన్ పరిధిలోని (భద్రాచలం రోడ్డు) తడికలపుడి- చీమలపాడు రైల్వే ట్రాక్ వద్ద ఆదివారం జరిగింది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు, రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

మృతుడు చామనచాయ రంగు, ఫుల్ టీషర్ట్, సిమెంట్ రంగు జీన్ ప్యాయింట్ ధరించి ఉన్నాడు. ఈ సంఘటన జీఆర్పీ ఇన్‌చార్జి ఎస్ఐ బి.భాస్కర్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 87126 58589, 94947 90619 నెంబర్లకు సమాచారం అందించాలని ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి ..

చుంచుపల్లి, జూలై7: పాత కక్షల నేపథ్యంలో వ్యక్తిపై కత్తితో దాడి చేసిన ఘటనలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలో గౌతంపూర్ ఏరియాలో ఆటో డ్రైవర్ రమేష్ శనివారం మృతుడు ఈశ్వర్(36)పై కత్తితో విచక్షణ రహితంగా దాడి చేశాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని ఖమ్మం తరలించారు. ఈ క్రమంలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నిందితుడు రమేష్ పరారీలో ఉన్నాడని, అతడి ఆచూకీ కోసం పోలీస్ బృందాలు గాలిస్తున్నాయని సీఐ రమేష్ తెలిపారు.

వడ్లగూడెంలో మహిళ..

దమ్మపేట, జూలై 7 : కడుపు నొప్పి భరించలేక ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందిన సంఘటన వడ్లగూడెం గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వడ్లగూడెం గ్రామానికి చెందిన గుంటి కల్పన (32) కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతుంది. ఈక్రమంలో గత నెల 26వతేదీన తీవ్రంగా వచ్చిన కడుపు నొప్పి తట్టుకోలేక పురుగుల మందు తాగింది. వెంటనే కుటుంబ సభ్యులు విజయవాడ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. మృతురాలి తల్లి విమల ఫిర్యాదు మేరకు ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలు

మణుగూరు, జూలై 7: విద్యుదాఘాతంతో వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన మణుగూరు మునిసిపాలిటీ పరిధిలోని భగత్‌సింగ్‌నగర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భగత్‌సింగ్‌నగర్‌లో ఓ రేకుల ఇంటికి పై సుతారి మేస్త్రి వంశీ బొద్దు కట్టే పనులు నిర్వహిస్తున్నాడు. కాగా ఇంటిపై తక్కువ ఎత్తులో ఉన్న 11 కేవీ వైర్లను గమనించక వాటికి తగిలాడు. దీంతో విద్యుత్ షాక్ గురై తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతని శరీర భాగం పూర్తిగా కాలిపోయింది. వెంటనే క్షతగాత్రుడిని మణుగూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

కాపర్ వైర్ చోరీ

కొణిజర్ల, జూలై7: మండల పరిధిలోని ఉప్పలచలక గ్రామానికి చెందిన పలువురు గిరిజన రైతులకు చెందిన రెండు ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్‌వైర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించిన సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. పొలాల వద్ద ఏర్పాటు చేసుకున్న రెండు ట్రాన్స్‌ఫార్మర్లలోని విద్యుత్‌కాపర్ వైర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. గమనించిన రైతులు కాపర్ వైర్ చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శంకర్‌రావు తెలిపారు.

రూ. 5.75 లక్షల గంజాయి పట్టివేత

భద్రాచలం జూలై7: భద్రాచలంలో ఆదివారం రూ. 5.75 లక్షల విలువైన 23 కేజీల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఏపీలోని అల్లూరి జిల్లా చింతూరు మండలం తుమ్మల గ్రామానికి చెందిన బాలరాజు భద్రాచలం మీదుగా గంజాయిని తరలించే ప్రయత్నం చేయగా, పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్న తరుణంలో అనుమానాస్పదంగా ఉన్న బాలరాజు వద్ద గంజాయి లభ్యమైనట్లు తెలిసింది. ఈ క్రమంలో అతడి ని పట్టుకొని 23 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు భద్రాచలం పట్టణ ఎస్ఐ విజయలక్ష్మి తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

● కుమారుడి మృతితో శోకసంద్రంలో తల్లిదండ్రులు

● బోనకల్ గ్రామంలో విషాదం



బోనకల్, జూలై 7: ఆదివారం సెలవు కావడంతో స్నేహితులం దరూ కలిసి సరదాగా బయటకు వెళ్లారు. ఆంధ్రా ప్రాంతంలోని ఏటి వద్దకు వెళ్లి నీళ్లను చూడగానే ఈత కొట్టాలనే సరదా విద్యార్థి ప్రాణాల మీదకు తెచ్చింది. లోతు ఎక్కువగా ఉండటంతో ఒక్కసారిగా గుండె పలిగి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన బోనకల్ గ్రామంలో విషాద చాయలను నింపింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుడిమళ్ల గోపాలరావు, రమాదేవి దంపతుల కుమారుడు సాయికృష్ణ(14) నాగులవంచలోని ఆద ర్శ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో చిరునోముల, చొప్పకట్లపాలెంలోని ఆరుగురు స్నేహితులతో కలిసి ఆంధ్రాలోని కృష్ణా జిల్లా వత్సవాయి మండలంలోని పొలంపల్లి వద్ద ఉన్న ఏటిలోకి వెళ్లారు. ఇసుక దిబ్బలతో పాటు నీళ్లు ఉండటంతో వాతావరణం ఆహ్లాదకరంగా అనిపించింది. వెంటనే సాయికృష్ణ అతని స్నేహితులు ఏటిలోకి దిగారు. నీటిలో సాయికృష్ణ, అతడి స్నేహితుడు శివరాంలు ముందుకు వెళ్తున్న క్రమంలో లోతు ఎక్కువగా ఉండటంతో కొట్టుకుపోతూ కేకలు వేశారు. మిగిలిన నలుగురు స్నేహితులు ఒడ్డుకు వచ్చారు. ఇంతలో అక్కడకు దగ్గరగా ఉన్న జాలర్లు తమ వద్ద ఉన్న చేపల వలను నీటిలో వేయగా శివరాం దాని సహాయంతో ప్రాణాలతో బయటపడ్డాడు. సాయికృష్ణను కూడా కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే మృతి చెందాడు. సమాచారాన్ని తల్లిదండ్రులకు అందించారు. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు కానరాని లోకాలకు వెళ్లడంతో, నువ్వు లేవా? ఇక రావా? నాన్న అంటూ తల్లిదండ్రులు మృతదేహం వద్ద రోదిస్తున్న తీరు అందరిని కంటతడి పెట్టించింది.



సాయికృష్ణ మృతదేహాన్ని తీసుకువస్తున్న జాలర్లు

భద్రాచలం వద్ద గోదావరిలో

హైదరాబాద్ వాసి గల్లంతు

భద్రాచలం, జూలై 7: భద్రాచలం వద్ద గోదావరిలో ఆదివారం హైదరాబాద్‌లోని అమీర్‌పేటకు చెందిన హరీష్ అనే వ్యక్తి గల్లంతయ్యాడు. భద్రాద్రి రామయ్యను దర్శించేందుకు వచ్చిన ఆయన ఆదివారం ఉదయం గోదావరిలో స్నానం చేసేందుకు నదిలోకి దిగిన లోతు అంచనా వేయలేక ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. ఈ సమాచారం అందుకున్న భద్రాచలం సీఐ సంజీవరావు, పోలీసులు, రెవెన్యూ, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టినా అతడి ఆచూకీ లభించలేదు. అతడి కోసం సోమవారం మరోసారి గాలింపు చేపట్టనున్నారు.



హరీష్(ఫైల్)

ఆ కుంచెలో ఒదిగిన భావాలెన్నో

▸ భద్రాద్రి రామాలయాన్ని చిత్రీకరిస్తున్న భువనగిరికి చెందిన యువతి లావణ్య

భద్రాచలం, జూలై 7: చిన్ననాటి నుంచి చిత్రలేఖనంపై ఉన్న మక్కువతో తనంతటతానే చిత్రలేఖనంలో ఎదుగుతోంది యాదాద్రి జిల్లా భువనగిరికి చెందిన నామోజు లావణ్య. బీకామ్ పూర్తి చేసిన లావణ్య చిత్రలేఖనంనే తన వృత్తిగా మలుచుకుంటోంది. ఇప్పటికే ఫ్రీహ్యాండ్ చిత్రాలు(స్కేలు, కొలతలు లేకుండా, పోట్రేట్ అండ్ ఫిగర్ చిత్రాలు) గీయడంలో ఆమె తనదైన శైలిలో రాణిస్తున్నారు. ఆయిల్‌పెయింట్స్‌తో పాటు యాక్రిలిక్‌మిక్స్‌ను కాన్వాస్‌పై రక రకాల రంగులతో చిత్రాలు వేసే సమయంలో స్కెచ్‌లకు ప్రాధాన్యమిస్తూ అందంగా అద్భుతంగా చిత్రాలను తీర్చిదిద్దుతున్నారు. 2016లో రాష్ట్రస్థాయిలో చిత్రలేఖనంలో ప్రథమస్థానాన్ని లావణ్య సాధించారు.



కాన్వాస్ యాక్రలిక్ పెయింటింగ్ వేస్తున్న లావణ్య

మహబూబాద్ జిల్లా మరిపెడ బంగ్లాలో మూడు రోజుల క్రితం రాక్‌స్టోన్స్‌పై పెయింటింగ్ వేయడం జరిగింది. ఇదే సమయంలో లైవ్ పెయింట్ పోట్రేట్ కూడా వేసింది. దక్షిణ అయోధ్యగా ఉన్న భద్రాచలాన్ని లైవ్ పెయింటింగ్ వేయాలన్నది తన ఆలోచన కావడంతో అందుకు అనుగుణంగా ప్రస్తుతం లైవ్ పెయింటింగ్ వేస్తోంది. సోమవారం పెయింటింగ్‌ను పూర్తి చేసి దేవస్థానం అధికారులు అందజేయనున్నట్లు లావణ్య విలేకర్లతో పేర్కొంది. అలాగే ఇప్పటికే స్వర్ణగిరి ఆలయంలో లైవ్ పెయింటింగ్ చిత్రీకరణ చేశానని, కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఉన్న అన్ని ఆలయాల లైవ్ పెయింటింగ్స్ వేసి ఆ దేవస్థానాలకు అందజేయాలన్నది తన లక్ష్యమని పేర్కొంది.

ఈ కార్యక్రమాన్ని డిసెంబర్ లేదా జనవరి నెలల్లో చేపట్టి వంద రోజుల్లో పూర్తి చేయాలన్నది నా లక్ష్యమని తెలిపింది. భవిష్యత్‌లో పురాణ సంబంధిత చిత్రాలను వేయాలన్నది తన ఆకాంక్షని పేర్కొంది. ఇదిలా ఉండగా చిత్రలేఖనంలో లావణ్యలో ఎంతో ప్రతిభ దాగి ఉంద ని, దీంతో తాను ఆమెకు సహకరిస్తున్నానని చిత్రకారుడు శ్రీనివాసరెడ్డి తెలిపారు.



ఇటీవల మరిపెడ బంగ్లా గుట్టల్లో జంతువుల చిత్రాలను చిత్రీకరిస్తున్న లావణ్య

టీడీపీ సమావేశానికి వెళ్లిన

భద్రాద్రి నాయకులు

● భద్రాచలం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని వినతి

● ఐదు గ్రామాలను భద్రాచలంలో కలపాలని వేడుకోలు



హాజరైన టీడీపీ నాయకులు

భద్రాచలం, జూలై 7: హైదరాబాద్‌లో ఆదివారం ఎన్టీఆర్ ట్రస్టు భవన్‌లో జరిగిన టీడీపీ సమావేశానికి భద్రాచలం నుంచి నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. భద్రాచలం నుంచి పడాలి శ్రీనివాస్, షేక్ అజీమ్, కంభంపాటి సురేష్‌కుమారు, కోనేరు రాము, తాళ్లూరి చిట్టిబాబులు ఉన్నారు. వీరు ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు కలిసి విభజన సమయంలో జరిగిన నష్టాన్ని, భద్రాచలం అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అలాగే ఐదు గ్రామ పంచాయతీలను భద్రచాలంలో కలపాలని వినతిపత్రం అందజేశారు.

మానవత్వాన్ని చాటుకున్న మల్లవరం పోలీసులు



తల్లాడ, జూలై 7: తల్లాడ మండలం మల్లవరంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన శెట్టిపల్లి కృష్ణయ్య కుటుంబానికి అదే గ్రామానికి చెందిన పోలీస్ కానిస్టేబుళ్లు ఆర్థికసాయం అందించారు. ఆర్థిక ఇబ్బందులున్న మృతుడి కుటుంబానికి రూ.35వేలు ఆర్థిక సహాయాన్ని కానిస్టేబుళ్లు అందజేశారు. నివాసానికి సరైన ఇల్లు కూడా లేక పూరిగుడిసె కావడంతో వర్షం వస్తే కుటుంబం ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఈ దుస్థితిని తెలుసుకున్న పోలీసు కానిస్టేబుళ్లు ఆర్థికసాయం అందజేసి అండగా నిలిచారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు పసుపులేటి ప్రసాద్, నంద్యాల హన్మంతరావు, గాదె విష్ణు, రంజిత్, కుంచం రాంప్రసాద్, సైదులు, ఉద్దగిరి పూర్ణచంద్రరావు, ఎర్రి అంకమరావు పాల్గొన్నారు.

పేద ప్రజల అభ్యున్నతే కాంగ్రెస్ ధ్యేయం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ముదిగొండ మండలంలో సుడిగాలి పర్యటన
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



వల్లాపురంలో బీటీరోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న భట్టి, వృద్ధురాలిని హత్తుకున్న భట్టి, రైతు వీరబాబుతో మాట్లాడుతూ..

ముదిగొండ, జూలై 7: పేదప్రజల అభ్యున్నతే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని డిప్యూటీ సీఎం, మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ముదిగొండ మండలంలో ఆదివారం భట్టి విక్రమార్క సుడిగాలి పర్యటనలు చేసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.మండలంలోని వల్లాపురం, గంధసిరి, పెద్దమండవ, బాణాపురం, వల్లభి, మల్లారం గ్రామాల్లో రూ.35.90కోట్లతో చేపట్టనున్న బీటీ రహదారులకు శంకుస్థాపనలు చేశారు. వల్లాపురంలో మొక్కలు నాటారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కోట్లరూపాయల నిధులు కేటాయిస్తుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందుతాయని, ప్రభుత్వం అందించే పథకాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వల్లాపురం వద్ద వీరబాబు అనే రైతు పశువులను మేపుతుండగా మార్గమధ్యలో భట్టి విక్రమార్క తన వాహనాన్ని ఆపి రైతుతో మాట్లాడారు. రైతు ఫోన్ నుంచి తన ఇంట్లో ఉన్న మహిళలతో మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అమ్మపేట సమీపంలోని రోడ్డు పక్కన మొక్కజొన్నలు అమ్ముతున్న నాగమణి వద్ద కంకులు కొనుగోలు చేసి తన సిబ్బందికి ఇచ్చారు. మీరు మొక్కజొన్న పంట పండించారా అని నాగమణిని అడిగి తెలుసుకొని ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అని భట్టి విక్రమార్క ఆరా తీశారు. పెద్దమండవ గ్రామానికి వచ్చిన భట్టి విక్రమార్కను గ్రామస్థులు తమ గ్రామానికి బస్సుల సంఖ్యను పెంచాలని కోరారు. ఆయా గ్రామాలకు వచ్చిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్, డీఎంహెచ్‌వో మాలతీ, డీఆర్‌డీవో సన్నాసయ్య, ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి, సీఐ రాజిరెడ్డి, ఎంపీపీ సామినేని హరిప్రసాద్, తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీధర్‌స్వామి, సొసైటీ ఛైర్మన్లు తుపాకుల యలగొండస్వామి, సామినేని వెంకటయ్య, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు, మందరపు నాగేశ్వరరావు, పసుపులేటి దేవేంద్రం, బిచ్చాల బిక్షం, కందిమళ్ల వీరబాబు, అజ్గర్, మల్లెల అజయ్, రవీందర్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, గుడిపూడి ఝాన్సీరాణి, వెంకటరెడ్డి, ఉసికల రమేష్, బిచ్చాల అన్వేష్ పాల్గొన్నారు.

నేడు వేంసూరులో మంత్రి తుమ్మల పర్యటన



వేంసూరు,జూలై7: వేంసూరులో సోమవారం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటించనున్నారని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాసర చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. వేంసూరులో సొసైటీ ఆధ్వర్యంలో నిర్మించిన పెట్రోల్ బంకును ప్రారంభిస్తారని చెప్పారు. అలాగే గ్రీన్‌ఫీల్డ్ హైవేకు ఎగ్జిట్ మంజూరు చేయించినందుకు తుమ్మలను సన్మానించనున్నట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- ఖమ్మం ఎంపీ రఘురామిరెడ్డి



వినతిపత్రం అందచేస్తున్న అనాసాగరం గ్రామస్థులు

నేలకొండపల్లి, జూలై7: గ్రామాల్లో నెలకొని ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఖమ్మం పార్లమెంటు సభ్యుడు రామసహాయం రఘురామిరెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని అనాసాగరంలో కాంగ్రెస్ నాయకుడు కర్రి నర్సయ్య ఇంట్లో జరిగిన కార్యక్రమంలో ఎంపీ పాల్గొన్నారు. అనాసాగరం వచ్చిన ఎంపీ రఘురామిరెడ్డికి ఘన స్వాగతం లభించింది. అనంతరం గ్రామంలో సమస్యలను గ్రామస్తులు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. పాఠశాలల పార్ట్‌టైం స్వీపర్లను ఫుల్‌టైం స్వీపర్లుగా చేయాలని, కనీస వేతనం రూ.18వేలు ఇచ్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని స్కూల్ స్వీపర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్.ఖాదర్ ఎంపీకి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నెల్లూరి భద్రయ్య, శాఖమూరి రమేష్, వేగినాటి లక్ష్మీనర్సయ్య, వెన్నపూసల సీతారాములు, చెరువు స్వర్ణ, తాటికొండ కృష్ణయ్య, కర్రి నర్సయ్య, మామిడి వెంకన్న, కుక్కల హనుమంతరావు పాల్గొన్నారు.

భద్రయ్యను పరామర్శించిన బీఆర్ఎస్ నాయకులు

కారేపల్లి,జూలై7: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి గ్రామానికి చెందిన రైతు పచ్చిపాల భద్రయ్యను ఆదివారం ఖమ్మంలో బీఆర్ఎస్ నాయకులు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధు పరామర్శించారు. ఇటీవల ఆయన పట్టాభూమిని ఒకరు కబ్జా చేశారు. దీంతో మనస్థాపనికి గురైన భద్రయ్య పురుగులమందు తాగాడు. ఓ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న భద్రయ్యను పరామర్శించారు. అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని వారు హామీ ఇచ్చారు. వారి వెంట మాజీ ఎమ్మెల్యే సండ్రవెంకటవీరయ్య, జడ్పీ ఛైర్మన్ లింగాల కమలరాజు, నాయకులు పాల్గొన్నారు.

వివాద రహితుడు రఘోత్తమరెడ్డి



రఘోత్తమరెడ్డి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

ఖమ్మంసంక్షేమవిభాగం, జూలై7: విద్యుత్‌శాఖలో వివాదస్పదమైన ప్రాంతాల్లో కూడా వివాదరహితంగా రఘోత్తమరెడ్డి క్షేత్రస్థాయిలో పనిచేసి రైతుల మన్ననలు పొందారని తెలంగాణ పవర్ డిప్లమో ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నార్ల సుబ్రహ్మణేశ్వరరావు పేర్కొన్నారు. పదవీ విరమణ పొందిన చల్లా రఘోత్తమరెడ్డి దంపతులకు ఆదివారం ఖమ్మంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పలు విద్యుత్, ఉద్యోగ సంఘాల రాష్ట్ర, ఉమ్మడి జిల్లా నాయకులు జీ నాగమల్లేశ్వరరావు, సుధాకర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రఘు రామయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఖమ్మంరూరల్, జూలై7: మండల పరిధిలోని ఏదులాపురం, పెద్దతండా, పంచాయతీల పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏఈ క్రాంతిసింహ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు సత్తుపల్లి విద్యార్థినులు

సత్తుపల్లిరూరల్, జులై7: ఈనెల 11,12వ తేదీల్లో మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి బాలికల సబ్ జూనియర్స్ ఫుట్‌బాల్ పోటీలకు సత్తుపల్లి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. పాఠశాలలో చదువుతున్న కే.ధనవర్ష, టీ.ఉమశ్రీ, పీ.తనుశ్రీ, ఎస్.ఖయాతీ జిల్లా జట్టు తరపున ప్రాతినిధ్యం వహించనున్నట్లు హెచ్‌ఎం నీరుడు నాగేశ్వరరావు తెలిపారు.

కల్లూరు బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక



నరేంద్ర, రాము

కల్లూరు, జూలై7: జాతీయ బీసీ సంక్షేమ సంఘం కల్లూరు పట్టణ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి లింగబోయిన పుల్లారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడిగా బయ్యారపు నరేంద్ర, ప్రధాన కార్యదర్శిగా ఎనుముల రాము, ఉపాధ్యక్షుడిగా లింగాల మారేష్, (నారాయణ), నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా కల్లూరు పట్టణానికి చెందిన ఆళ్లకుంట నరిసింహారావు, కమిటి సభ్యులుగా బొడ్డు పిచ్చయ్య, చిత్రాల వెంకటరాజును ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.బీసీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

హోమియోపతి వైద్యశిబిరం విజయవంతం

సత్తుపల్లిరూరల్, జులై7: సత్తుపల్లిలోని శ్రీసత్యసాయి సేవాసమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రశాంతి నిలయంలో ఆదివారం నిర్వహించిన ఉచిత హోమియోపతి వైద్య శిబిరం విజయవంతమైంది.కల్లూరుకు చెందిన డాక్టర్ తిరుపతయ్య 60మందిని పరీక్షించారు. ట్రస్ట్ ఉచితంగా మందులు పంపిణీ చేసింది. కార్యక్రమంలో ట్రస్ట్ కన్వీనర్ వీ.రామారావు, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు,వర్ధిని, సురేష్‌కుమార్,అబిదాబేగం, తనూజ పాల్గొన్నారు.

సామాజిక సేవే లయన్స్‌క్లబ్ ధ్యేయం



వైరా, జూలై7: సామాజిక సేవే లక్ష్యంగా వైరా లయన్స్‌క్లబ్ పని చేస్తుందని లయన్స్‌క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ తెలిపారు. 18సంవత్సరాల్లో నాలుగు కోట్లతో సేవ కార్యక్రమాలు నిర్వహించామని పేర్కొన్నారు. ఆదివారం వైరాలోని కమ్మవారి కల్యాణ మండపంలో వైరా లయన్స్‌క్లబ్ 19వ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అధ్యక్షుడిగా చింతలపూడి వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా అబ్బూరి రమేష్, కోశాధికారిగా మరికంటి గోపి తదితరులు ప్రమాణస్వీకారం చేశారు. మెడికోలైన ఉంద్రు అజయ్, అప్పారావులను సన్మానించారు. దివ్యాంగులకు వీల్‌చైర్లు, కుట్టుమిషన్లు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వీ.శివప్రసాద్, లగడపాటి ప్రభాకర్‌రావు, మాదినేని సునీత, ఉంద్రు శ్యాంబాబు, వరలక్ష్మీ, పెరుమాళ్ల కృష్ణమూర్తి, పెనుగొండ ఉపేంద్రరావు, వనమా విశ్వేశ్వరరావు, నూకల ప్రసాద్, వాసు, రాయపూడి వెంకటేష్, మరికంటి శివ, డేడీకుమారి, చింతోజు నాగేశ్వరరావు, వై.బుచ్చిరామారావు, కొమిరిశెట్టి శ్రీధర్ పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



కొణిజర్లలో పాల్గొన్న నాయకులు

నేలకొండపల్లి, జూలై7: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం మండల పరిధిలోని గువ్వలగూడెంలో ఘనంగా నిర్వహించారు. తొలుత కొలికపొంగు నరసయ్య మాదిగ, వంగూరి వెంకటేశంమాదిగ దండోరా పతకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వంగూరి గంగాధర్ మాదిగ, పాలేరు డివిజన్ ఇన్‌ఛార్జి వంగూరి ఆనందరావు, మహేశ్వరరావు ,చిన్నవీరబాబు, రాము, నాగయ్య, ప్రభాకర్ ఉపేందర్ పాల్గొన్నారు

ఖమ్మంరూరల్:మండలంలోని ఎమ్-వెంకటాయపాలెం, గూడురూపాడు, కోటనారాయణపురం తదితర గ్రామాల్లో ఎంఆర్పీఎస్ ఆవిర్భావ వేడుకలను ఘణంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాతీయ కమిటీ ఉపాధ్యక్షులు వంగూరి ఆనందరావు, కందుల బాబు, మరికంటి సతీష్, జనార్ధన్, ఆనందరావు, కోటి, వీరబాబు, నరేందర్, పుల్లయ్య పాల్గొన్నారు.

కొణిజర్ల: మండలంలో వేడుకలను ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఘనంగ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గొడ్డుగర్ల నాగయ్య, యాదగిరి, చాట్ల భాస్కర్, వెంకటేశ్వర్లు, శ్రీను, నాగభూషణం, ప్రసాద్, అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

తల్లాడ: మండల పరిధిలోని తెలగవరం గ్రామంలో దండోరా జెండాను ఎంఆర్పీఎస్ జాతీయ నాయకుడు ఏపూరి వెంకటేశ్వరరావుమాదిగ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ నాయకులు ఏపూరి వెంకట్రావ్‌మాదిగ, శ్రీనివాసరావు, గొల్లమందల నవీన్, తేళ్లూరి నిఖిల్, తాటి ముత్తయ్య, మేడి బాలయ్య పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ శాఖ బదిలీలు చేపట్టాలి

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై 7: గిరిజన సంక్షేమ శాఖలో బదిలీలు, పదోన్నతులు వెంటనే విడుదల చేయాలని టీఎస్ యుటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి డిమాండ్ చేశారు. ఆదివారం సంఘం భవనంలో జరిగిన జిల్లా కమిటి సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘంరాష్ట్ర ఉపాధ్యక్షురాలు దుర్గాభవాని,జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాగమల్లేశ్వరరావు, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బచ్చోడును మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలి

తిరుమలాయపాలెం, జూలై7: మండలంలోని బచ్చోడును మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని సీపీఎం మాస్‌లైన్ జిల్లానాయకులు కమ్మకోమటి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని పిండిప్రోలులో పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం బచ్చోడును మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తామని ఇచ్చిన నిలబెట్టుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో మండల కార్యదర్శి ఎస్. వెంకటేశ్వర్లు, తిమ్మిడి హనుమంతరావు, నవీన్, శివలింగం పాల్గొన్నారు.

'పెండింగ్ సమస్యలను పరిష్కరించండి'



మాట్లాడుతున్న సత్తుపల్లి నాయకులు

సత్తుపల్లి, జూలై7: పెండింగ్‌లో ఉన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టర్‌ను కలవనున్నట్లు విశ్రాంత ఉద్యోగుల సంఘం నిర్ణయించింది. ఈ మేరకు ఆదివారం సత్తుపల్లి పట్టణంలోని సంఘ కార్యాలయంలో యూనిట్ స్థాయి సమావేశంలో నాయకులు మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న బకాయి డీఏలు, హెల్త్ కార్డుల అమలు తదితర సమస్యలపై జిల్లా సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. తమతో కలిసి విశ్రాంత ఉద్యోగులు కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆసంఘ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు వీ.చెంచురెడ్డి, యూనిట్ అధ్యక్షప్రధాన కార్యదర్శులు కేశవరెడ్డి, బద్రుద్దీన్, అద్దంకి వెంకటరత్నం, కృష్ణయ్య, సాంబశివరెడ్డి, వాణీ, సుహాసిని, మధుసూదనరాజు తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు జంతువుల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలి

డాక్టర్ బోడెపూడి శ్రీనివాసరావు



పెంపుడు కుక్కలకు చికిత్స చేస్తున్న ఏడీ

నేలకొండపల్లి,జూలై7:పెంపుడు జంతువుల యజమానులు, వాటి పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని నేలకొండపల్లి పశువైద్యశాల ఏడీ బోడెపూడి శ్రీనివాసరావు చెప్పారు. ఆదివారం నేలకొండపల్లిలోని పశువైద్యశాలలో జూనోసిస్‌దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 20పెంపుడు కుక్కలకు చికిత్స చేశారు. రాబిస్ వ్యాధికి టీకాలు వేశారు. ఏటా పెంపుడు కుక్కలకు, పిల్లులకు రేబిస్ టీకాలు తప్పనిసరిగా వేయించాలన్నారు. పచ్చి పాలు తాగకూడదని, పాలు, మాంసం, గుడ్లు పూర్తిగా ఉడికించిన తర్వాత మాత్రమే తినాలన్నారు. ఆరోగ్యవంతమైన పశువుల మాంసం, పాలు మాత్రమే ఆహారంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ సర్జన్ బి.సంజయ్‌రెడ్డి పెంపుడు జంతువులకు చికిత్స అందించటంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వెన్నపూసల సీతారాములు, మల్లెబోయిన సత్యనారాయణ, యడవల్లి ఉపేందర్, బొల్లం సత్యనారాయణ, గోపాలమిత్రులు నర్సింహారావు, నరేష్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ గాయబ్

వైరాలో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం



సొసైటీ రోడ్డులో రెండునెలల కిందట సిమెంట్ దిమ్మెపై ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్



ప్రస్తుతం ఖాళీగా దర్శనమిస్తున్న సిమెంట్ దిమ్మె

వైరా, జూలై7: వైరా మునిసిపాలిటీలోని పట్టణ విద్యుదీకరణ పనులు ఓ కాంట్రాక్టర్ ఆడిందే ఆట.. పాడిందే పాటగా ఉందనే విమర్శలున్నాయి. ట్రాన్స్‌కోలో ఉన్నతాధికారుల అండదండలతో చెలరేగిపోతున్న సదరు కాంట్రాక్టర్ కిందిస్థాయి అధికారులు, సిబ్బందిని ఖాతర్ చేయకుండా తన ఇష్టానుసారం పనులు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఐదు సంవత్సరాల నుంచి వైరాలో ఈ తంతు కొనసాగుతుంది. సదరు కాంట్రాక్టర్ నిర్వాకానికి మునిసిపాలిటీ ఐదో వార్డులోని 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, తొలగింపే సాక్షిభూతంగా ఉంది. ఐదోవార్డు సొసైటీ రోడ్డులో తుళ్లూరి కోటేశ్వరరావు ఇంటి సమీపంలో సిమెంట్ దిమ్మె నిర్మించి దానిపైన 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను రెండునెలల కిందట ఏర్పాటు చేశారు. ఇంకా ఆ ట్రాన్స్‌ఫార్మర్‌కు ట్రాన్స్‌కో అధికారులు ఎలాంటి కనెక్షన్ ఇవ్వలేదు. తీరా ఇప్పుడు ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడి నుంచి తొలగించారు. ప్రస్తుతం సిమెంట్ దిమ్మె దిష్టిబొమ్మలా దర్శనమిస్తుంది. ట్రాన్స్‌ఫార్మర్‌ను తల్లాడ రోడ్డులోని ఒక చర్చి సమీపంలోకి తరలించి అక్కడ ఏర్పాటు చేశారు. స్థానిక ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది ఎలాంటి మార్కింగ్ ఇవ్వకుండానే తన ఇష్టానుసారం అడ్డగోలుగా సిమెంట్ దిమ్మెలు నిర్మించటం, ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేయటం ఆతర్వాత వేరే చోటకు తొలగించటం వంటి పనులు నిత్యకృత్యంగా మారాయనే విమర్శలున్నాయి. ఇళ్ల నిర్మాణాలు, ఇతరత్రా ప్రజల అవసరాలు ఉన్నచోట సిమెంట్ దిమ్మెలు అడ్డంగా నిర్మించటం ఆతర్వాత వారి అవసరాలను ఆసరా చేసుకొని వారితో బేరసారాలు చేసుకొని సెటిల్‌మెంట్లకు పాల్పడటం పరిపాటిగా మారిందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ట్రాన్స్‌ఫార్మర్ తొలగింపు విషయమై స్థానిక ట్రాన్స్‌కో సిబ్బందిని ప్రశ్నించగా తుళ్లూరి కోటేశ్వరరావు ఇంటి సమీపంలో ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటుకు తాము ఎలాంటి మార్కింగ్ ఇవ్వలేదని అయినప్పటికీ కాంట్రాక్టరే అక్కడ నిర్మాణం చేశారని, తాము అనుమతించిన చోటనే 100కేవీ ట్రాన్స్‌పార్మర్‌ను ఏర్పాటు చేశామని వివరించారు.

కలుషిత నీరే తాగునీరు

- కల్లూరులో భగీరథ, గ్రామ పంచాయతీ నీరు కలిపి సరఫరా
- నీచు వాసన, ఇసుక రేణువుల కారణంగా ప్రజారోగ్యానికి గండం
- పట్టించుకోని అధికారులు



పసుపు రంగులో మంచినీరు

కల్లూరు, జూలై 7: రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఎదిగిన కల్లూరు మేజర్ గ్రామ పంచాయతీలో కలుషిత నీరే తాగునీరుగా మారింది. భగీరథ తాగునీరు, గ్రామ పంచాయతీ వారు సరఫరా చేస్తున్న నీరు ఒకే పంపింగ్ విధానంలో (మిక్సింగ్) సరఫరా చేయటంతో ఈ పరిస్థితి దాపురించింది. ఆ నీరు కూడ నీచు వాసనతో పాటుగా పసుపు రంగులో ఇసుక రేణువులు కలిగి వస్తున్నాయి. దీంతో స్థానిక ప్రజలు ఇలా సరఫరా అవుతున్న నీటిని తాగేందుకు నిరాశక్తత చూపుతున్నారు. ఇక తమ గృహ అవసరాలకు మాత్రమే ప్రజలు వినియోగిస్తున్నారు. గతంలో ఆర్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్టు ద్వారా కల్లూ మండల ప్రజలకు తాగునీరు అందేది. భగీరథ పథకం ద్వారా తాగునీటి సరసరా ప్రారంభించినప్పటి నుంచి స్వచ్ఛమైన నీరు ప్రజానీకానికి అందించి పాపన పోలేదు. కల్లూరు పంచాయతీ పరిధిలో సుమారు 20 వేలకు పైగా జనాభా విస్తరించి ఉన్నప్పటికీ పదిశాతం వరకు కూడా ప్రస్తుతం సరఫరా అవుతున్న నీరు తాగని పరిస్థితి. ఇదే అదునుగా ప్రైవేట్‌గా వాటర్ ప్లాంట్‌లు పుట్టగొడుగుల్లా వెలిసినాయి. అవి కూడ నాణ్యత ప్రమాణాలు పాటించని పరిస్థితి. ఈ పరిస్థితుల్లో నీటి వ్యాపారం జోరుగా సాగుతుంది.

పాలకులు దృష్టి సారించాలి..

కల్లూరు పట్టణంలో భగీరథ పథకం ద్వారా శుద్ధి చేసిన నీరు సక్రమంగా అందిస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది. మరో వైపున భగీరథ నీరు కూడ అంతంత మాత్రంగా అందుతుంది. ఈ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయంగా పాలకులు, అధికారులు ప్రత్యేక దృష్టి సారించి భవిషత్తు అవసరాలను దృష్టిలో గతంలో తాగునీరు అందించిన ఆర్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్టులను పునురుద్ధరణ చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికే కల్లూరు పట్టణంలో ప్రతి రోజు నిత్యం కుళాయిల ద్వార కలుషిత నీరు సరఫరా జరుతున్న ఆ నీరు త్రాగని పరిస్థితి. క్షేత్ర స్థాయిలో అధికార యంత్రాంగం పరిశీలన చేస్తే వాస్తవ పరిస్థితి వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. మరో వైపున భగీరథ అధికారులు మాత్రం కలుషిత నీరు సరఫరా అవుతున్న తమకు ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైన తాగునీటి సమస్యను పరిష్కారంపై పాలకులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

కలుషిత నీటిపై ఫిర్యాదు చేస్తే పంచాయతీ కార్యదర్శి బెదిరింపులు

విశ్వనాథపల్లి ప్రజల ఇక్కట్లు

కారేపల్లి జూలై7: మండల పరిధిలోని విశ్వనాథపల్లి గ్రామపంచాయతీ పరిధిలో మురుగు నీరు సరఫరాపై ఫిర్యాదు చేస్తే పంచాయతీ కార్యదర్శి బెదిరింపులకు పాల్పడుతున్నాడని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ నీరు తాగడంతో వంటిపై దద్దులు వస్తున్నాయని దీంతో ఆసుపత్రులకు వెళ్ళుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలకు సైతం ఇదే నీరు సరఫరా జరుగుతుండటంతో విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారు. వాటర్‌ట్యాంకు కింద గేట్‌వాల్‌వద్ద ప్యాకింగ్ తాడు సరిగలేకపోవడంతో నీరు పైపులైన్ ద్వార గ్రామంలోకి వెళ్ళుతున్నాయి. ఇదే విషయం స్థానిక కార్యదర్శికి, పంచాయతీ సిబ్బందికి కొందరు గ్రామస్తులు వారం రోజులుగా చెప్పుతున్నా పట్టించుకోవడంలేదని బంజర గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి తెలిపాడు. అంతేకాక దిక్కున్నకాడ చెప్పుకొండి అంటూ బెదిరిస్తున్నట్లు శ్రీనివాస్‌రెడ్డి తెలిపాడు.



ట్యాంకు వద్ద మురుగునీరు

బదిలీ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

ఖమ్మం ఖానాపురంహవేలి, జూలై7: సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేసి వారి స్థానంలో విద్యావలంటీర్లను నియమించేలా ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు కృషి చేస్తామని ఎస్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులు తెలిపారు. ఆదివారం జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మను కలిసి వినతిపత్రం అందించారు. సాంకేతిక పొరపాట్లను సవరించి ఉపాధ్యాయులకు న్యాయంచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు యాదగిరి, మన్సూర్, మహబూబ్ పాల్గొన్నారు.

ప్రజా నాట్యమండలి తరగతులను జయప్రదం చేయండి

ఖమ్మంరూరల్, జూలై 7: ఖమ్మం పట్టణంలో ఈనెల 12, 13, 14వ తేదీల్లో జరగనున్న ప్రజానాట్య మండలి రాష్ట్రవిద్యా వైజ్ఞానిక తరగతులను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు నామా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని వరంగల్‌క్రాస్ రోడ్డులో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డబ్బు చుట్టూ ప్రపంచం తిరుగుతున్న కాలంలో మనం ఉన్నామని ఈ ప్రభావం కలాకారుల జీవన విధానంపై కూడా పడుతుందన్నారు. ఈ నేపథ్యంలో ఈ విద్యా వైజ్ఞానిక తరగతులు ఉపయోగ పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో నందిగామ కృష్ణ, ఆంతోని, దోనోజు పాపాచారి, వీరబాబు పాల్గొన్నారు.